
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



కడప
జిల్లా వార్తలు

5

బుధవారం 12 మార్చి 2025

రంజాన్ వేళలు



	ఇఫ్తార్ (బుధవారం సాయంత్రం)	సహెరీ (గురువారం ఉదయం)
కడప	6.30	5.09
ప్రొద్దుటూరు	6.31	5.13

హోంగార్డుల సేవలు అభినందనీయం



హోంగార్డులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్పీ

● ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడపక్రైం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పోలీసులతో పాటు సమానంగా విధులు నిర్వర్తిస్తూ అందరి మన్ననలు చూరగొంటున్న హోంగార్డుల సేవలు అభినందనీయం.. స్ఫూర్తిదాయకమని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ అన్నారు. జిల్లాలోని హోంగార్డుల సిబ్బందికి వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు రెండు వారాల పాటు నిర్వహించిన మొబిలైజేషన్ కార్యక్రమం ముగింపు సందర్భంగా మంగళవారం డీమొబిలైజేషన్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ ముందుగా హోంగార్డుల పరేడ్ (కవాతు)ను పరిశీలించి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ శిక్షణ కాలం చాలా కీలకమని, విద్య నేర్చుకున్న అనంతరం సమాజానికి ఉపయోగపడకపోతే ఆ విద్యకు విలువ ఉండదని, అలాగే గత పదిహేను రోజుల్లో మీరు నేర్చుకున్న అంశాలను దైనందిన విధుల్లో ప్రతిబింబించేలా చూడాలన్నారు. కలిసి పనిచేద్దాం, కలిసి పోలీసు వ్యవస్థను మరింత మెరుగ్గా ప్రజలకు సేవలందించేలా కృషి చేద్దామని ఎస్పీ పిలుపునిచ్చారు. అనంతరం అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన హోంగార్డులకు ఎస్పీ బహుమతులు అందించారు. ఏఆర్ సిబ్బందిని అభినందించి బహుమతులు అందించారు. ఏఆర్ అదనపు ఎస్పీ బి.రమణయ్య మాట్లాడుతూ రాయలసీమలోనే మొట్టమొదటిసారిగా హోంగార్డుల సిబ్బందికి మొబిలైజేషన్ కార్యక్రమాన్ని ఎస్పీ ఏర్పాటు చేశారన్నారు. పరేడ్‌కు విచ్చేసిన ఎస్పీ తన చేతుల మీదుగా అల్పాహారాన్ని వడ్డించారు. అనంతరం ప్రతిభ చూపిన పలువురు హోంగార్డులకు ఎస్పీ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్‌ఐలు శ్రీశైలరెడ్డి, టైటస్, ఆనంద్, వీరేశ్, శివరాముడు, ఆర్ఎస్ఐలు పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, హోంగార్డుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ఎస్పీకి సెల్యూట్ చేస్తున్న పోలీసులు



జగన్ ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు కదా.. పులివెందులను ఏ మేరకు అభివృద్ధి చేశారు..? ఎన్ని పరిశ్రమలు తీసుకువచ్చి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించారు..? నియోజకవర్గానికి ఇంకా మనం చేయాల్సింది ఏమైనా ఉందా ? అంటూ మంత్రి నారాలోకేశ్ మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవిని అడిగి తెలుసుకున్నారు. అయితే జగన్ సీఎంగా ఉన్న ఐదేళ్ల కాలంలో పులివెందులకు ఇదిగో.. అదిగో.. అంటూ మెడికల్ కళాశాల నిర్మించడం తప్ప ఏ పనిచేయలేదంటూ బీటెక్ రవి చెప్పడంతో మంత్రి నారాలోకేశ్ అవాక్కయ్యారు. వివరాలిలా..

పులివెందులను అభివృద్ధి చేద్దాం

● ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందిద్దాం
● పరిశ్రమల ఏర్పాటుతో పాటు ఆగిపోయిన పనులపై దృష్టి
● త్వరలో ప్రతి కార్యకర్తను కలుస్తా
● ఇక్కడ ఏమేం కావాలో త్వరలోనే చర్చిద్దాం
● మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవితో మంత్రి నారాలోకేశ్

(కడప-ఆంధ్రజ్యోతి): కదిరిలోని శ్రీలక్ష్మి నరసింహ బ్రహ్మోత్సవాలకు ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించేందుకు నారాలోకేశ్ పుట్టపర్తి వచ్చి అక్కడ నుంచి రోడ్డు మార్గాన కదిరికి చేరుకున్నారు. అక్కడ ఉత్సవాల్లో పాల్గొని అమరావతి వెళ్లేందుకు కడప ఎయిర్‌పోర్టు నుంచి అమరావతి వెళ్లాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా బ్రహ్మోత్సవాల తరువాత రోడ్డు మార్గాన సోమవారం రాత్రి కదిరి నుంచి పులివెందుల అటు నుంచి కడపకు వచ్చారు. ఇక మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి నేతృత్వంలో లోకేశ్‌కు సుమారు 80 వాహనాల్లో భారీ కాన్వాయ్‌తో కార్యకర్తలు స్వాగతం పలికారు. పులివెందుల నుంచి బీటెక్ రవి లోకేశ్ పక్కన కూర్చుని కడప ఎయిర్‌పోర్టుకు వచ్చారు. ఈ సందర్భంగా వీరిద్దరి మధ్య పలు ఆసక్తికర సంభాషణలు జరిగాయి. జగన్ ఐదేళ్లు సీఎంగా ఉన్నారు కదా పులివెందులకు ఎన్ని పరిశ్రమలు తెచ్చారు.. ఏం అభివృద్ధి చేశారని ఆరా తీయగా.. 'పులివెందుల అభివృద్ధి అంతా రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే బీజం పడింది. రింగురోడ్డు ఇవన్నీ అప్పట్లో జరిగాయి. ఒక్క పరిశ్రమ కూడా జగన్ హయాంలో తీసుకురాలేదు. బస్టాండు కట్టేందుకే వందేళ్లు పట్టింది. ఇదిగిదిగో మనకు కనిపిస్తున్న మెడికల్ కళాశాల మాత్రమే కట్టారు. అంతకు తప్ప ఏ పని చేయలేదని' సమాధానం ఇవ్వడంతో మంత్రి లోకేశ్ అవాక్కయ్యారు. సొంత నియోజకవర్గానికి జగన్ ఏం చేయలేకపోయారా..! అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

అభివృద్ధికి రోడ్డుమ్యాప్ గీద్దాం

సీఎం చంద్రబాబు కుప్పం, తాను ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరిని ఎలా డెవలప్ చేస్తున్నామో పులివెందుల అభివృద్ధికి ప్రత్యేక రోడ్డుమ్యాప్ గీద్దాం.. ఒక యాక్షన్ ప్లాన్ తయారు చేద్దామని లోకేశ్.. బీటెక్ రవితో అన్నారు. త్వరలోనే ఒక సమావేశం ఏర్పాటు చేసి పులివెందులను డెవలప్ చేయాల్సిన వాటిపై ప్రణాళిక రూపొందిద్దామని, అక్కడ ఏ పనులు ఆగిపోయాయి, ఏవి పూర్తి చేయాలన్న వాటిపై ప్లాన్ చేద్దామని, పులివెందులను కూడా కుప్పం, మంగళగిరికి దీటుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

కార్యకర్తలతో ముఖాముఖి

పులివెందుల అభివృద్ధితో పాటు టీడీపీ కార్యకర్తల సంక్షేమంలో కూడా అలాగే పాటుపడదామని లోకేశ్ అన్నారు. పులివెందులకు పరిశ్రమలు తీసుకువచ్చి ఇక్కడ నిరుద్యోగులకు ఉపాధి కల్పించి రైతులను ఆదుకుంటామని తెలిపారు. అలాగే పార్టీ ఆవిర్భావం నుంచి జెండా మోస్తున్న కార్యకర్తలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు వైసీపీ హయాంలో నియోజకవర్గంలో ఎవరెవరిపై ఎన్ని కేసులు నమోదయ్యాయో ఆ వివరాలు ఇవ్వాల్సిందిగా లోకేశ్ కోరారు. త్వరలోనే పులివెందుల అభివృద్ధికి సంబంధించి ఒక కార్యక్రమాన్ని ప్రారంభిద్దామని, ఇక్కడికి తానే వచ్చి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తానని తెలిపారు. ఆ రోజు ప్రతి కార్యకర్తతో ముఖాముఖి మాట్లాడి వారి అభిప్రాయాలు తీసుకుని వారిని అన్ని విధాలుగా ఆదుకుంటానని, త్వరలోనే పులివెందుల అభివృద్ధి కోసం సమావేశం నిర్వహించి ఒక యాక్షన్‌ప్లాన్ తయారు చేద్దామని లోకేశ్ తెలిపారు. కాగా కడప ఎయిర్‌పోర్టులో కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్, జేసీ అదితిసింగ్‌లు లోకేశ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి వీడ్కోలు పలికారు.

7 మాలేపాడు సర్పంచి చెక్‌పవర్ రద్దు

అర్జీలను వెంటనే పరిష్కరించాలి

● భూముల రీసర్వే పకడ్బందీగా ఉండాలి ● సీసీఎల్ఏ అదనపు అధికారి జి.జయలక్ష్మీ



సీసీఎల్ఏ వీసీలో పాల్గొన్న కలెక్టర్ శ్రీధర్

కడప కలెక్టరేట్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను త్వరిత గతిన పరిష్కరించాలని, జిల్లాలో భూముల రీసర్వే వేగవంతంగా, పక్కాగా నిర్వహించాలని సీసీఎల్ఏ (చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్) అదనపు అధికారి జి.జయలక్ష్మీ అన్నారు. మంగళవారం విజయవాడ నుంచి రెవెన్యూ సదస్సులు, భూముల రీసర్వేపై జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో ఆమె మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జయలక్ష్మీ మాట్లాడుతూ జిల్లాల్లో రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలను పరిశీలించి, స్వయంగా అధికారులే అర్జీదారునితో మాట్లాడి సంతృప్తి చెందేలా పరిష్కరం ఉండాలని తెలిపారు. భూముల రీ సర్వేపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయమై క్షేత్రస్థాయిలో సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలన్నారు. భూముల రీసర్వే ప్రక్రియ రెవెన్యూలో ముఖ్యమైందని, జాప్యం లేకుండా అంకితభావంతో పూర్తి చేయాలన్నారు. ఇందుకు ఆయా తహశీల్దార్, వీఆర్‌ఓలు బాధ్యత వహించాలని, విలేజ్ బౌండరీ, గ్రౌండ్ బౌండరీ తప్పనిసరిగా చేయాలన్నారు. ఈ వీసీకి కలెక్టరేట్‌లోని తన ఛాంబరు నుంచి కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, బోర్డు మీటింగ్ హాలు నుంచి జేసీ అదితి సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు, సర్వే ల్యాండ్ అధికారి మురళీకృష్ణ, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

7

అనుమతి లేకుండా అబార్షన్లు, ఆపరేషన్లు

● ఆసుపత్రి సీజ్ చేసిన అధికారులు

మోసగాళ్లొస్తున్నారు.. తస్మాత్ జాగ్రత్త

● పేద, మధ్య తరగతి వర్గాలే టార్గెట్
● నష్టపోతున్న గ్రామీణులు
● బయటకు చెప్పుకోలేకపోతున్న వైనం

7

6

ఉద్యోగాల పేరిట ఘరానా మోసం

ఉపన్యాస పోటీలను సద్వినియోగం చేసుకోండి

● జాయింట్ కలెక్టర్ అదితిసింగ్

కడప మారుతీనగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): యువతలో దాగి వున్న ప్రతిభను గుర్తించి వారికి మంచి అవకాశం కల్పించేందుకు వీలుగా ఈ నెల 15న జరగనున్న 'వన్ నేషన్ వన్ ఎలక్షన్' అనే అంశంపై జరిగే ఉపన్యాస పోటీలలో యువత తప్పక పాల్గొనాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ కోరారు. వికసిత్ భారత్ నేషనల్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్ -2025 కార్యక్రమంలో భాగంగా పార్లమెంట్‌లో ప్రసంగించే అవకాశాన్ని యువతకు కల్పించేందుకు ఉపన్యాస పోటీలు నిర్వహించడం గొప్ప విషయంగా భావించాలన్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం కలెక్టరేట్‌లో జేసీ చేతులమీదుగా ఆమె కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా నెహ్రూ యువకేంద్ర జిల్లా యూత్ ఆఫీసర్ మణి కంఠ మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లాకు చెందిన 18-25 ఏళ్ల వయస్సు మధ్యగల యువత పోటీలలో పాల్గొనేందుకు అర్హులన్నారు. నగరశివారు ప్రాంతమైన కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఫిజికల్ మోడ్‌లో జరగనున్న ఈ కార్యక్రమానికి ఔత్సాహిక యువత ముందుగా మై భారత్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకుని ఒక నిమిషం వీడియో అప్‌లోడ్ చేయాలన్నారు. తదుపరి పేర్ల నమోదు కోసం హెచ్‌టిటిపిఎస్://ఎఫ్ఓఆర్ ఎం ఎస్.జిఎల్ఈ/ జిడబ్ల్యుఎం సిఎంయూ ఓ ఎక్స్5 సివిఎస్‌వైపి9ఎక్స్5 అనే లింక్ ఉపయోగించాలన్నారు. వివరాలకు 91776 16677 అనే నెంబర్‌ను సంప్రదించాలన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జేసీ అదితిసింగ్

ఇది నా అడ్డా.. అరటి లారీలకు నో ఎంట్రీ

● లారీ డ్రైవరును చితకబాదిన సీఐ

● వ్యాపారులు డీఎస్పీకి ఫిర్యాదు చేయడమే కారణమా ?



పులివెందులటౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నా అడ్డా.. ఇక్కడ అరటి లారీలకు నో ఎంట్రీ అంటూ ట్రాఫిక్ సీఐ లారీ డ్రైవర్లు, కార్మికులపై జులుం ప్రదర్శిస్తున్నారు. తన మాట వినని ఓ లారీ డ్రైవర్‌ను దుర్భాషలాడడమే కాకుండా చితకబాదిన సంఘటన పులివెందుల్లో చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే..

రెండు వారాల క్రితం ట్రాఫిక్ సీఐ హాజీవల్లి తమను వేధిస్తున్నారని, లేనిపోని ఆంక్షలు విధిస్తూ ఇబ్బందులు పెడుతున్నారని అరటి వ్యాపారులు, డ్రైవర్లు డీఎస్పీ మురళీనాయక్‌కు ఆయన కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి అరటి వ్యాపారులు కానీ వారి లారీలు కానీ కనిపిస్తే సీఐ వారిని చితకబాదుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. భారీ వాహనాలు సైతం పట్టణం లోపలికి ఉదయం 9గంటల్లోపు పదుల సంఖ్యలో వస్తున్నాయి. కానీ పట్టణ శివారులో ఉన్న వేయింగ్ బ్రిడ్జి వద్దకు అరటి లారీలు రాకూడదని ఆ సీఐ నిబంధనలు విధించినట్లు తెలిసింది. వాహనాలు కనిపిస్తే ఇష్టం వచ్చినట్లు జరిమానాలు విధిస్తున్నారనే విమర్శలున్నాయి. మంగళవారం కూడా అరటి వ్యాపారులపై తన పంజా విసిరినట్లు డ్రైవర్లు ఆరోపిస్తున్నారు. కదిరి రోడ్డులోని వేయింగ్ మిషన్ వద్దకు అరటికాయల లోడుతో వచ్చిన లారీ డ్రైవరు సోహైల్‌ను ట్రాఫిక్ సీఐ తన లాఠీతో చితకబాదినట్లు చెబుతున్నారు. లారీలో ఉన్న రోజువారి కూలీలు బాబా, మరో నలుగురిపై దాడి చేసినట్లు వారు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకుని అక్కడికి వచ్చిన అరటి వ్యాపారులపై కూడా దుర్భాషలాడినట్లు తెలిసింది. తాము డీఎస్పీకి ఫిర్యాదు చేయడమే కారణమా అని వాపోతున్నారు. ఇలాగే కొనసాగితే ఈ ప్రాంతానికి ఢిల్లీ వ్యాపారస్తులు రాకుండా పోయే ప్రమాదం ఉందని, దీనివల్ల ఈ ప్రాంతంలో వేల ఎకరాల్లో సాగు చేసిన అరటి పంటలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఆ అధికారి ఆగడాలకు అడ్డువేయాలని ఆ ప్రాంతవాసులు, డ్రైవర్లు, రైతులు కోరుతున్నారు.

డీఎస్పీ ఆదేశాల మేరకే చర్యలు

పులివెందుల ట్రాఫిక్ సమస్యపై డీఎస్పీ మురళినాయక్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా అరటిలోడు లారీలపై చర్యలు తీసుకుంటున్నాం. డ్రైవర్లను, వ్యాపారులను మందలించానే కానీ కొట్టలేదు. ఇది అవాస్తవం.

- హాజీవల్లి, ట్రాఫిక్ సీఐ

కాలువ కబ్జాపై కదలిన యంత్రాంగం

● చదును చేసిన కాలువను ఎక్స్‌కవేటర్‌తో తవ్విన సిబ్బంది
● మున్సిపల్ కాలువగా బోర్డు ఏర్పాటు



చదును చేసిన కాలువను తవ్వుతున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

ప్రొద్దుటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో మున్సిపల్ కాలువను ఆక్రమించి కబ్జా చేయడంపై ఆంధ్రజ్యోతిలో మార్చి 7న 'కాలువ కబ్జా' అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున మంగళవారం టౌన్‌ప్లానింగ్ ఏసీపీ నాగరాజు, టీపీవో చంద్రమోహన్, సర్వేయర్‌తో కలిసి సర్వేనెంబరు 568లో కబ్జాకు గురైన కాలువ స్థలాన్ని పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో కాలువ ఎంత విస్తీర్ణంలో కబ్జాకు గురైందో సిబ్బందితో సర్వే చేయించారు. అనంతరం ఎక్స్‌కవేటర్‌తో చదును చేసిన కాలువను తవ్వారు. దాదాపు రూ.2కోట్ల విలువ చేసే 10 సెంట్ల మేర స్థలానికి మున్సిపల్ కాలువగా బోర్డు ఏర్పాటు చేశారు. అలాగే సర్వే నెంబర్లు 564, 557, 572 లలో వున్న కాలువ ఆక్రమిత కట్టడాలకు సైతం కూడా మార్కింగ్‌లు ఇచ్చారు. వీటికి నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటామని కమిషనర్ అన్నారు.

బ్రహ్మంసాగర్ నీరు విడుదల

బ్రహ్మంగారిమఠం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తెలుగుగంగలో అంతర్భాగమైన బ్రహ్మంసాగర్ రిజర్వాయరు నుంచి రైతన్నల కోరిక మేరకు నీటిని విడుదల చేసినట్లు తెలుగుగంగ ఏఈ నాగేశ్వర్‌రావు మంగళవారం తెలిపారు. నీటిని వదలాలని మండలంలోని రైతన్నలు మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లగా, వారి విజ్ఞప్తి మేరకు ఆయన అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో నీటిని విడుదల చేశామని తెలిపారు. ప్రస్తుతం ఎడమ కాల్వకు 340 క్యూసెక్కులు, కుడికాల్వకు రూ.40 క్యూసెక్కులు మొత్తం 380 క్యూసెక్కుల నీటిని రైతుల కోసం విడుదల చేసినట్లు పేర్కొన్నారు. రైతులు నీటిని వృథా చేసుకోకుండా పంట పొలాలకు సద్వినియోగం చేసుకోవాలని ఏఈ తెలిపారు.



ఎడమ కాల్వ నుంచి పంటలకు వెళుతున్న బ్రహ్మంసాగర్ నీరు

ప్రొద్దుటూరు ఈఆర్వోపై విచారణకు ఆదేశాలు

● విచారణాధికారిగా జేసీ అదితిసింగ్ నియామకం

కలికిరి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు శాసనసభ నియోజకవర్గం ఓటర్ల నమోదు అధికారి (ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్)గా పనిచేసిన కడప జీఎస్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎం.రామ్మోహన్ వ్యవహారాలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. నియోజకవర్గంలో చనిపోయిన ఓటర్లు, డూప్లికేటు, బోగస్ ఓటర్లను తొలగించడంలో తీవ్రమైన అలసత్వం వహించారనే ఆరోపణలతో ఆగ్రహించిన కేంద్ర ఎన్నికల కమిషన్ సస్పెన్షన్‌కు ఆదేశించింది. దీంతో ప్రభుత్వం ఎన్నికల ముందే సస్పెండ్ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రామ్మోహన్ సమర్పించిన సంజాయిషీలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం 2025 జనవరి 30న ఆయనపై వున్న సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ ఆదేశాలిచ్చింది. అయితే దీనిపై తగు చర్యలు తీసుకోవాల్సిందిగా సాధారణ పరిపాలన శాఖ, సీసీఎల్ఏ, జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. తాజాగా ఇవే అంశాలపై విచారణ జరిపేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు ఆయనపై వున్న అభియోగాల గురించి విచారణ జరిపేందుకు కడప జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌ను నియమించింది. విచారణాధికారికి అవసరమైన సమాచారం అందజేస్తూ సహకరించేందుకు డీఆర్వో విశ్వేశ్వరనాయుడును కూడా నియమించింది. ఆరు నెలలు లోగా విచారణ చేసి పూర్తి నివేదిక అందజేయాల్సిందిగా కోరతూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా మంగళవారం రెండు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు.



కాసులు కురిపించే పంటలు సాగు చేస్తున్నా.. ఆశించిన స్థాయి కన్నా అధికంగానే దిగుబడులు సాధిస్తున్నా.. అదును చూసి అమ్ముకునేందుకు అవకాశం లేకపోవడంతో నష్టపోతున్నామని రాజంపేట వ్యవసాయ డివిజన్‌లోని ఉద్యాన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రవాణాకు సిద్ధంగా ఉన్న అరటి గెలలు

దిగుబడులొస్తున్నా.. నిలువ సామర్థ్యం ఏదీ?

- ఉద్యాన పంటలకు నెలవు రాజంపేట
- ఏడాదికి వెయ్యి కోట్ల ఫలసాయం..
- శీతల గిడ్డంగులు లేక ఏటేటా భారీగా నష్టాలు

రాజంపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో ప్రధానమైన ఉద్యానవన పంట మామిడి. ఏడాదికి రూ.300 కోట్లకు పైగా వ్యాపారం జరుగుతోంది. రైల్వేకోడూరు, చిట్వేలి, పెనగలూరు, వీరబల్లె, పుల్లంపేట మండలాల్లో మామిడి చెట్లు లేని ఊర్లే లేవు. సుమారు 30 వేల ఎకరాల్లో బేనీషా, నీలీషా, తోతాపురి, అంటుమామిడి, రుమాని, పోలూరు, మల్గూబా తదితర 30 రకాల మామిడి కాయలను పండిస్తారు. కోడూరు మార్కెట్‌యార్డు ద్వారా దేశంలోని అన్ని నగరాలతో పాటు ఇతర దేశాలకు కూడా ఎగుమతి చేస్తుంటారు. వీరబల్లి మామిడికి అంతర్జాతీయ మార్కెట్‌లో పెద్దఎత్తున డిమాండ్ ఉంది.

అరటి సాగుచేయని ఊరు లేదు

రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాల్లో సుమారు 50 వేల ఎకరాల్లో అరటి సాగు చేస్తారు. ఏడాది పొడవునా దిగుబడి వచ్చే ఈ పంట కారణంగా రూ.400 కోట్లకు పైబడి వ్యాపారం జరుగుతుంది. ఎకరాకు రూ.4 లక్షలు తక్కువ లేకుండా ఆదాయం వస్తుండగా, ఖర్చులు పోను 3 లక్షలు రైతుకు మిగులుతోంది.

భారీగా బొప్పాయి సాగు

ఈ డివిజన్‌లో 25 వేల ఎకరాల్లో బొప్పాయి సాగవుతుండగా, రూ.250 కోట్ల వరకు వ్యాపారం జరుగుతోంది. ఏడాదిలో 6 నెలలు ఈ వ్యాపారం సాగుతుంది. ఒక్కో ఎకరాకు సాగు ఖర్చులు పోను 3 లక్షల వరకు ఆదాయం వస్తుంది.

ఏడాది పొడవునా.. నిమ్మ

అనాదిగా ఈ ప్రాంతాల్లో ప్రధాన ఆదాయ వనరు నిమ్మ పంట. అయితే అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీ పెరగడం, ధర తగ్గిపోవడంతో, క్రమేణా ఈ పంట సాగు విస్తీర్ణం తగ్గింది. ప్రస్తుతం 5 వేల ఎకరాల్లో సాగయ్యే ఈ పంట వల్ల రమారమి 10 కోట్ల ఆదాయం వస్తుంది.



నిలువ చేసే అవకాశం లేక పారవేసిన నిమ్మకాయలు

కోల్డ్ స్టోరేజీలు లేక..

రెండు నియోజకవర్గాల్లో ఉద్యాన పంటల ద్వారా వెయ్యి కోట్ల వ్యాపారం జరుగుతోంది. అయితే సీజన్‌లో ఒక్కసారిగా దిగుబడులు అధికంగా రావడంతో డిమాండు తగ్గిపోయి ధర పడిపోతోంది. నిలువ చేసుకునే అవకాశం లేకపోవడంతో నష్టం వస్తున్నా సరే తప్పనిసరై అమ్ముకోవాల్సి వస్తోంది. అలాంటి పరిస్థితుల్లో పంట దిగుబడులను నిలువ చేసుకుని డిమాండ్ పెరిగిన తర్వాత విక్రయిస్తే మరింత అధికంగా ఆదాయం వచ్చేందుకు అవకాశం ఉంది. అందుకోసం కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ విషయం గతంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు రైతులు విజ్ఞప్తి చేయడంతో ఆ మేరకు వారు హామీ ఇచ్చారు.



శీతల గిడ్డంగులను ఏర్పాటు చేయాలి



రాజంపేట, కోడూరు ప్రాంతాల్లో శీతల గిడ్డంగులను ఏర్పా టు చేయాలి. ప్రజా ప్రతినిధులు వీటి ఏర్పాటుపై దృష్టి సారించాలి. ప్రతి మండల కేంద్రంలో ఒక్కో కోల్డ్ స్టోరేజి ఉంటే రైతులకు అనుకూలంగా ఉంటుంది.

- గుడారు విష్ణు, రైతు, మిట్టమీదపల్లె, రాజంపేట మండలం.

ప్రోత్సహించాలి



ఉద్యాన రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వేల కోట్ల రూపాయల ఆదాయం అందించే ఈ పంటలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. శీతల గిడ్డంగులను కచ్చితంగా ఏర్పాటు చేయాలి.

- టి.లక్ష్మీనారాయణ, రైతు, రాజంపేట

వన్యప్రాణులకు తాగునీటి ఏర్పాట్లు

● ఫారెస్ట్ రేంజి అధికారి కళావతి

సిద్దవటం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో పెట్టుకుని సిద్దవటం రేంజిలోని అటవీ పరిసర ప్రాంతాల్లో వన్యప్రాణులకు తాగునీటి సౌకర్యం కల్పించామని ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె మాట్లాడుతూ వన్యప్రాణులు తాగునీటి కోసం గ్రామంలోకి రాకుండా సాసర్ పిట్‌లతో పాటు, పలు నీటి కుంటల్లో ట్రాక్టర్ల ద్వారా నీటిని నింపామన్నారు. గ్రామంలోకి అడవి జంతువులు, వన్యప్రాణులు వస్తే ప్రజలు వాటికి ఎలాంటి ప్రాణహాని తలపెట్టకుండా తమకు సమాచారం ఇవ్వాలన్నారు. వన్యప్రాణులకు ప్రాణహాని తలపెడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. డిప్యూటీ రేంజర్ ఓబులేశు, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.



సాసర్‌పిట్‌లో నీరు నింపుతున్న అటవీశాఖ సిబ్బంది

బృందావనాలుగా.. చెత్త కేంద్రాలు : డీఎల్‌పీవో

పెద్దతిప్పసముద్రం మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రభుత్వం నిర్మించిన చెత్త కేంద్రాలను (డంపింగ్ యార్డు) సంపదను సృష్టించే బృందావనాలుగా తీర్చిదిద్దుతామని డీఎల్‌పీఓ నాగరాజు వెల్లడించారు. మంగళవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ముందుగా పెద్దతిప్పసముద్రం సచివాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న డంపింగ్ యార్డులను మార్చి నెలాఖరులోగా సరికొత్త హంగులతో బృందావనాలుగా తయారు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కందుకూరు, మద్దయ్యగారిపల్లె, గ్రామాల్లోని డంపింగ్ యార్డులను తనిఖీ చేశారు. కార్యాలయంలో ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ మునిప్రతాప్‌తో కలిసి సమీక్షించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మునిప్రతాప్, పంచాయతీ కార్యదర్శులు మనోహర్, విద్యావతి, కొండా శివప్రసాద్, ప్రమీలా, సురేఖ, నాగరాణి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ నాగరాజు

గంజాయిని అరికట్టడంలో పోలీసులు విఫలం

కడప సెవెన్ రోడ్స్, మార్చి 11 (ఆంధ్ర జ్యోతి): కడపలో గంజాయి వినియోగం, విక్రయాలను అరికట్టడంలో పోలీసుల విఫల మయ్యారని, వెంటనే గంజాయి అలర్ట్ ప్రక టించాలని జిల్లా సీపీఐ కార్యదర్శి గాలి చంద్ర అన్నారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి జి.మద్దిలేటిపై దాడి చేసిన అల్లరిమూకలను అరెస్టు చేయకపోతే ఆందోళన చేస్తామన్నా రు. కాగా మంగళవారం స్థానిక రిమ్స్‌లో చికిత్స పొందుతున్న మద్దిలేటిని పరామర్శించి గాలి చంద్ర హెచ్చరించారు. కాగా సోమవారం స్థానిక సాక్షి కార్యాలయం తన తమ్ముడు మల్లికార్జునతో కొంతమంది అల్లరిమూకలు గొడవపడుతున్నారని పోయిన మద్దిలేటిపై గంజాయి తాగిన మత్తులో దాడి చేసి గాయపరిచన్నారు. 24 గంటలు అవుతున్నా ఇంతవరకు అరెస్టు చేయకపోవడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి కేసీ బాదుల్లా పాల్గొన్నారు.



మద్దిలేటిని పరామర్శిస్తున్న జిల్లా సీపీఐ కార్యదర్శి గాలి చంద్ర

ఇరువర్గాల ఘర్షణ.. ఇద్దరికి గాయాలు

మదనపల్లె అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఇరువర్గాల ఘర్షణలో ఇద్దరు గాయపడినట్లు వన్‌టౌన్ సీఐ ఎరీషావలి తెలిపారు. ఆయన కథనం మేరకు స్థానిక నీరుగట్టువారిపల్లెలో స్థలం విషయంలో బొమ్మిశెట్టి వెంకటేశ్(50),బొమ్మిశెట్టి రమణమ్మ (70), అదే గ్రామానికి చెందిన కప్పల చంద్ర కుటుంబసభ్యులు గొడవపడ్డారు. ఈ సందర్భంగా కప్పల చంద్ర కుటుంబ సభ్యులతో పాటు వారి మిత్రులు నలుగురు తమపై దాడి చేసి గాయపరిచారని వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. క్షతగాత్రులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల కారణంగా ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నిమ్మనపల్లె కస్బాకు చెందిన మమత మంగళవారం పురుగుమందు తాగి ఆత్మ హత్యాయత్నం చేసింది, ఆకస్మారక స్థితిలో పడిఉన్న ఆమెను గమనించిన కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నిమ్మనపల్లె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం.. కేసు నమోదు

కలకడ, మార్చి 11(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఎనుగొండపాలెం పంచాయితీ మొర్రంమీదపల్లెకు చెందిన యువకుడు మంజునాథ్(24) అదృశ్యం కావడంతో మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఈ నెల 8వ తేదీ సాయంత్రం ఇంటి నుంచి బయటికి వెళ్లిన యువకుడు తిరిగి రాలేదు. స్నేహితులు, బంధువులను విచారించినా ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. హరిప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

నాటుసారా తరలిస్తున్న ఒకరి అరెస్ట్

రాయచోటిటౌన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): నాటు సారా తయారు చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు అన్నమయ్య జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జోగేంద్ర తెలిపారు. మంగళవారం ఆ యన స్థానిక ప్రొహిబిషన్ అం డ్ ఎక్సైజ్ స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. సంబేపల్లె మండలం శెట్టిపల్లి పెద్దబిడికి సమీపంలో అటవీ ప్రాంతంలో మంగళవారం దాడులు నిర్వహించి ఆదిరెడ్డినాయక్ అనే వ్యక్తిని అరెస్టు చేసి, 30 లీటర్ల నాటుసారాను, ఒక మోటారు బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. నాటుసారా తయారీకి సిద్ధంగా ఉన్న 60 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసినట్లు ఆయన తెలియజేశారు. నిబంధనలను ఉల్లఘించి ఎవరైనా నాటుసారా తయారు చేసినా, విక్రయించినా పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ శశిధర్, సిబ్బంది వేమారెడ్డి, మోహన్‌రెడ్డి, హుస్సేన్, బాలకృష్ణ, జానీఫ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నట్లు తెలియజేశారు.



నాటుసారా, నిందితుడితో ఎక్సైజ్ పోలీసులు

ఉపాధి హామీ కూలీ మృతి

ఓబులవారిపల్లె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్కావారిపల్లె గ్రామ పంచాయతికి సంబంధించిన ఉపాధి హామీ కూలీ ఎర్రతోటి ఎల్లమ్మ(80) పనికి వెళ్లి తిరిగి వస్తూ గుండెపోటుకు గురై మరణించిందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి మలరెడ్డి తెలిపారు. ఎంపీడీవో, ఈవోపీఆర్డీ, ఏపీవోలు పరామర్శించారు.

దౌర్జన్యంగా ముగ్గురాయి మైనింగ్

లింగాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తమ పట్టా భూమిలో దౌర్జన్యంగా ముగ్గురాయిని వెలికితీసేందుకు ప్రయత్నిస్తున్నారని ఇప్పట్ల గ్రామానికి చెందిన టి.విజయమోహన్‌రెడ్డి తహసీల్దార్ ఈశ్వరయ్య, ఎస్ఐ మధుసూదన్‌రావుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో విజయమోహన్‌రెడ్డికి సర్వేనెంబర్ 434, 435లో 7.7ఎకరాల్లో మైనింగ్ లీజు ఉంది. ఆ భూమిలో పి.ఓబుళరెడ్డి, మనోహర్‌రెడ్డిలు దౌర్జన్యంగా మైనింగ్ చేసి ముగ్గురాయి వెలికితీసేందుకు క్రేన్ బిగించి ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. విచారణ చేయమని రెవిన్యూ వారి దృష్టికి తీసుకెళ్లానని ఎస్ఐ తెలిపారు.

ఉద్యోగాల పేరిట ఘరానా మోసం

- రూ.17 లక్షలు టోకరా
- సుండుపల్లెలో కేసు నమోదు
- మోసపోకండి: ఎస్ఐ శ్రీనివాసులు

సుండుపల్లె, మార్చి11: ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పలువురు నిరుద్యోగులను మోసగించిన ఉదంతం మండలంలోని పొలిమేరపల్లె గ్రామ పంచాయతీకి చెందిన అయ్యప్పరెడ్డి ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చింది. హైదరాబాదుకు చెందిన సాయితేజ, గుంటూరుకు చెందిన, జాషువా, నవ్య ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి పొలిమేరపల్లెకు చెందిన ఐదుగురి దగ్గర రూ.17 లక్షలు తీసుకొని మోసం చేశారని ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు.
రోజులు గడుస్తున్నా ఉద్యోగం ఇప్పించకపోగా రూ.7 లక్షల రూపాయలు వెనక్కి ఇచ్చి మిగిలింది ఇవ్వకుండా చేతులెత్తేశారని ఫిర్యాదు దారుడు ఆవేదన వ్యక్తం చేశారు. వినాయకనగర్, మడితాడు, కుంటలముందరకు చెందిన పలువురు యువకులు కూడా వీరి చేతిలో మోసపోయినట్లు సమాచారం.

ఉద్యోగం ఇప్పిస్తామంటే నమ్మకండి

డబ్బులిస్తే ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎవరు చెప్పినా నమ్మకండి అని ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. నిరుద్యోగ యువత కష్టపడి చదివి ఉద్యోగాలు సంపాదించాలన్నారు. ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని ఫోన్లు చేస్తే, తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

టీడీపీ నేత కారుకు నిప్పు

రామసముద్రం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఇంటి బయట నిలిపి ఉం చిన తన కారుకు మంగళవారం తెల్లవారుజామున దుండగులు నిప్పు పెట్టినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడ్ వి లేకరులకు తెలిపారు. వేకువజామున పేలుడు శబ్దం వినిపించ డంతో బయటికి వచ్చి చూడగా, టయోటా ఇన్నోవా కారు మంటల్లో కాలిపోతూ కనిపించిందని , టైర్లు కాలి పేలినట్లు గుర్తించామన్నారు. ఈ మేరకు ఫిర్యాదు చేయడంతో మదనపల్లె సీఐ సత్యనారాయణ, ఎస్ఐ రవికుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. విషయం తెలుసుకున్న మదనపల్లె ఎమ్మెల్యే కుమారుడు జునాయిద్ పరామర్శించారు. ఈ దుశ్చర్యకు నిరసనగా రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేష్, మదనపల్లె నేత తులసిరెడ్డి, కిశోర్‌కుమార్‌గౌడ్ మండల కేంద్రంలో దుకాణదారులు స్వచ్ఛందంగా బంద్ నిర్వహించారు. విజయకుమార్‌గౌడ్ తమ్ముళ్లకు, టీడీపీలోని ఓ సామాజిక వర్గ నేతల నడుమ భూతగాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కారు దగ్ధం కావడంతో ఉత్కంఠ నెలకొంది



కారు దగ్ధంపై వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కుమారుడు జునాయిద్

చేతులెలా వచ్చాయమ్మా..!

●అప్పుడే పుట్టిన ఆడబిడ్డను..గుట్టలో వదిలి వెళ్లిన తల్లి

ములకలచెరువు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఆ తల్లికి చేతులేలా వచ్చాయో...అప్పుడే పుట్టిన ఆడబిడ్డను బ్యాగులో ఉంచి గుట్టలో వదిలేసి వెళ్లింది. వివరాల్లోకి వెళితే...ములకలచెరువులోని ఉమాశంకర్ కాలనీ సమీపంలో ఉన్న గుట్టలో సోమవారం ఉదయం అప్పుడే పుట్టిన ఆడబిడ్డను ఓ బ్యాగులో ఉంచి తల మాత్రం కనిపించేలా వదిలేసి వెళ్లారు. అటుగా వెళ్ళిన కాలనీకి చెందిన సుమియా అనే మహిళ చిన్నారి ఏడ్పు విని ముందుకెళ్లి చూడగా బ్యాగులో ఆడబిడ్డ కన్పించింది. దీంతో పాపను ఇంటికి తీసుకొచ్చి స్నానం చేయించి, దుస్తులు వేశారు. విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. .



గుట్టలో దొరికిన చిన్నారి

కనకరుద్రాణి తిరునాళ్లకు ఘనంగా ఏర్పాట్లు

●నేటి రాత్రి పీవీజీపల్లెలో విడిది

పుల్లంపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పీవీజీపల్లె, రామసముద్రం పంచాయతీల సరిహద్దులో దేవరకొండ గుట్ట వద్ద వెలసిన కనకరుద్రమ్మ తిరుణాలను ఈనెల 13న అత్యం త వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ మండపాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయం చుట్టూ చలువపందిళ్లు వేసి రంగు రంగుల విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. చతుర్దశినాడు కనకరుద్రమ్మ ఊటుకూరు శివాలయం నుంచి బయలుదేరి పల్లె గ్రామంలో రాత్రికి విడిది చేస్తారు. అక్కడ మహిళలు ఉపవాసంతో అమ్మవారికి ఎదుర్కోలు నిర్వహించి దీక్ష పూర్తి చేస్తారు. మరుసటిరోజు తెల్లవారుజామునే కనకరుద్రమ్మ దేవరకొండ గుట్ట వద్ద ఉన్న ఆలయానికి చేరుకుంటారు. అర్చకులు ఆమెకు ప్రత్యేక పూజలు చేసి ఆలయంలో ఆశీనురాలిని చేస్తారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు.



కనకరుద్రమ్మ అమ్మవారు

రైలు పట్టాలపై యువకుడి మృతదేహం

మదనపల్లె అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీటీఎం రైల్వే స్టేసన్ సమీపంలో మంగళవారం సాయంత్రం రైలు పట్టాలపై ఓ యువకుడి మృతదేహం లభ్యమైనట్లు కదిరి రైల్వే ఎస్ఐ రహీం తెలిపారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు 20 నుంచి 23 ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని యువకుడు నరసాపురం వెళ్లే రైలు కింద పడి మృతి చెందినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని చెప్పారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు.

చోరీ కేసు నమోదు

మదనపల్లె అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు పడి నగలు అపహరించుకుని వెళ్లినట్లు తాలూకా సీఐ కళా వెంకటరహన తెలిపారు. మదనపల్లె పట్టణం, దేవతానగర్‌కు చెందిన చిన్నరెడ్డెప్ప అరుణ దంపతులు ఈ నెల 9 న ఇంటికి తాళం వేసి అరిగివారిపల్లెకు వెళ్లారు. సోమవారం రాత్రి తిరిగి వచ్చిన వారికి తలుపులకు వేసిన తాళంతోపాటు, బీరువా పగులగొట్టి ఉండడం కనిపించింది. దీంతో తాలుకా పోలీసులకు సమాచారం అందించారు. 74 గ్రాముల బంగారు నగలను తస్కరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఒక గది.. నలుగురు సిబ్బంది!



మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో సిబ్బంది లేక ఖాళీగా దర్శనమిస్తున్న క్యాబిన్

- జిల్లా మార్కెటింగ్ కార్యాలయంలో సిబ్బంది కొరత
- పోస్టులు భర్తీ చేయలేదంటున్న అధికారులు
- ఔట్‌సోర్సింగ్ సిబ్బందే దిక్కు..

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కొత్త జిల్లాలు ఏర్పాటు చేసి దాదాపు మూడేళ్లు కావస్తున్నా మార్కెటింగ్ శాఖనుసిబ్బంది కొరత పట్టిపీడిస్తోంది. హడావుడిగా జిల్లాలను విభజించిన గత ప్రభుత్వం, అందుకు అనుగుణంగా పోస్టులు భర్తీ చేయకుండా నిర్లక్ష్యం వహించిందనేందుకు మార్కెటింగ్ శాఖ జిల్లా కార్యాలయం సాక్ష్యంగా నిలుస్తోంది. జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన మార్కెట్ యార్డులో చెత్తాచెదారం, కంపచెట్ల నడుమ, పశువుల షెడ్డుకు సమీపంలోని ఒక గదిలో మార్కెటింగ్ శాఖ కార్యాలయం ఉంది. ఇన్‌చార్జి ఏడీ, ఒక సీనియర్ అసిస్టెంట్, ఇద్దరు కాంట్రాక్టు ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. మార్కెటింగ్ శాఖకు అవసరమైన కనీస వసతులు కూడా ఇక్కడ కనిపించడం లేదన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి.

పోస్టుల భర్తీ ఏదీ?

కొత్త జిల్లాల్లో పోస్టులు భర్తీ చేయడం లేదు. ఉన్న వారితోనే ఎలాగో కాలం నెట్టుకొస్తున్నాము. మౌలిక సదుపాయాలు కూడా అంతంత మాత్రమే.. ప్రస్తుత ప్రభుత్వమైనా పోస్టులు భర్తీ చేస్తే బాగుంటుంది.

- త్యాగరాజు, ఇన్‌చార్జి ఏడీ, మార్కెటింగ్‌శాఖ

పరిపాలన కష్టమవుతోంది

కూటమి ప్రభుత్వం కొత్త జిల్లాలపై శ్రద్ధ చూపకపోవడం దురదృష్టకరం. కొన్ని ఆఫీసుల్లో ఉద్యోగులకు భోజనం, తాగునీటి సౌకర్యం కూడా లేదని తెలిసింది. ఇప్పటికైనా సిబ్బందిని నియమిస్తే బాగుంటుంది.

- వంగిమళ్ల రంగారెడ్డి, రైతు సంఘం నేత

పోలీస్‌స్టేషన్ చేరిన 'పది' ప్రశ్న పత్రాలు

రామసముద్రం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 17నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల ప్రశ్న పత్రాలు పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచినట్లు రూట్ అధికారులు, మండల విద్యాశాఖాధికారులు ఆంజనేయులు, నారాయణ తెలిపారు. మంగళవారం సెట్-2 ప్రశ్న పత్రాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ సత్యనారాయణ, ఎస్ఐ జి.రవికుమార్, కానిస్టేబుల్ సమక్షంలో భద్రపరిచినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం చిట్టిబాబు, నారాయణ, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

యువతను మోసగించడంలో దొందూ..దొందే

వేంపల్లె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): యువతను, విద్యార్థులను నమ్మించి మోసం చేయడంలో టీడీపీ, వైసీపీలు దొందూ దొందే ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. వైసీపీ ప్రత్యేక హోదా సాధించకుండా ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ వంటివాటిని విస్మరించిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు అయిన డీఎస్సీ లేదు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు వేలకోట్లు బకాయిలు ఉన్నాయి, వైద్య విద్యను ప్రైవేటు పరం చేయాలనుకోవడం యువతను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు.

వైభవంగా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో ఉదయగిరి ఎల్లమ్మ

రాజంపేట టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మన్నూరులో ఉన్న ఉదయగిరి ఎల్లమ్మ ఆలయ 8వ వార్షికోత్సవాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. త సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఎల్లమ్మను దర్శించుకునేందుకు పట్టణం నలుమూలల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు. ఉదయం మహిళలు గుడి వద్ద పొంగుబాళ్లు సమర్పించారు. హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ సాయిస్వామి,ప్రధాన అర్చకులు నాగేంద్రశర్మ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు హాజరయ్యారు.

మోసగాళ్లొస్తున్నారు.. తస్మాత్ జాగ్రత్త

- పేద, మధ్య తరగతి వర్గాలే టార్గెట్
- నష్టపోతున్న గ్రామీణులు
- బయటకు చెప్పుకోలేకపోతున్న వైనం



మోసపోయే వాళ్లున్నంత వరకు మోసం చేసే వాళ్లు ఉంటారనేది జగమెరిగిన సత్యం. మారుతున్న కాలానికి అనుగుణంగా మోసాలు కూడా కొత్త రూపం సంతరించుకుంటున్నాయి. పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల అమాయకత్వాన్ని ఆసరగా చేసుకొని మాయమాటలు చెప్పి మోసాలకు పాల్పడుతున్నారు. నష్టపోయిన బాధితులు బయటకు చెప్పుకోలేక లోలోపల కుమిలిపోతున్నారు.

పెండ్లిమర్రి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిమండలం గ్రామంలో ఇటీవల పలువురు ఇలా మోసపోయారు. వారం రోజుల క్రితం ముగ్గురు వ్యక్తులు నందిమండలం గ్రామానికి వచ్చారు. తాము బజాజ్ ఫైనాన్స్ నుంచి వచ్చామని, ఎలాంటి ష్యూరిటీలు లేకుండా ఒక్కొక్కరికి రూ.50వేల నుంచి లక్ష రూపాయల వరకు రుణం ఇస్తామని చెప్పారు. రుణం కావలసినవారు రూ.2800 కడితే రూ.50వేలు, రూ.5600 కడితే లక్ష రూపాయలు ఇస్తామని వివరించారు. ఈ మొత్తాన్ని వడ్డీ లేకుండా ప్రతి నెల కంతుల రూపంలో చెల్లించవచ్చని నమ్మించారు. దీంతో సుమారు 200 మందికి పైగా ఫోన్‌పే ద్వారా వారి ఖాతాకు డబ్బు చెల్లించారు. అనంతరం ఏమైనా వివరాలు కావాలంటే సంప్రదించాలని చెప్పి ఓ ఫోన్ నెంబరు కూడా ఇచ్చి వారు వెళ్లిపోయారు. మరుసటి రోజు డబ్బు కట్టించుకున్న ఫోన్‌పే నెంబరుతోపాటు, ఆగంతు కులు ఇచ్చిన ఫోన్ నెంబరు కూడా పని చేయకపోవడంతో తాము మోసపోయినట్లు బాధితులు గుర్తించారు.

మరో కేసులో.. గ్రామానికి వచ్చిన ఓ వ్యక్తి సచివాలయం సమీపంలో లక్ష్మీదేవి అనే మహిళను పలుకరించాడు. కేంద్ర ప్రభుత్వం మీ బ్యాంకు ఖాతాలో డబ్బు జమ చేసిందని, దాన్ని డ్రా చేయించి ఇస్తానని నమ్మించాడు. ఆమె మెడలో ఉన్న ఐదు తులాల బంగారు గొలుసును చూస్తే ధనవంతులు అనుకుంటారని, నగదు జమ చేసేదాకా దానిని పక్కన తీసి పెట్టండని చెప్పాడు. దీంతో ఆమె గొలుసు తీసి అతనికి ఇవ్వడంతో ఆమె కన్నుగప్పి పారిపోయాడు. ఈ విషయంపై అప్పట్లో కేసు నమోదు చేసిన పోలీసులు దాన్ని రికవరీ చేసి ఇచ్చారు.



చెప్పుకుంటే అవమానమని..

ఐటీఐ చదువుకున్న నేనూ బాధితుడినే.. మోసగాళ్ల చెప్పే మాటలు వింటే ఎవరైనా నమ్మేస్తారు. వ్యాపారం పెంచుకుందా మనే ఉద్దేశ్యంతో డబ్బు చెల్లించా. బయటకు చెప్పుకోలేక సతమతమవుతున్నాం.

- గంగాధర్ రెడ్డి. చిల్లర దుకాణం..



ఫోన్‌పే ద్వారా చెల్లించాం..

పోగొట్టుకున్నది చిన్న మొత్తం కావడంతో పోలీసులకు చెప్పలేక సందిగ్ధంలో పడ్డాం. డబ్బు లేకపోయిన ఇతరుల నుంచి ఫోన్‌పే చేయించుకుని వారికి చెల్లించాం. మాలాగా ఎవరూ మోస పోకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలి.

- దాసరి బ్రహ్మయ్య, చిరు వ్యాపారి

17 టీఎంసీల నీటి నిల్వకు సహకరించండి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

మైదుకూరు రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంసాగర్‌లో 17 టీఎంసీల నీరు నిల్వ చేసేందుకు సహకరించాలని అసెంబ్లీలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కోరారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం ఎమ్మెల్యే మాట్లాడారు. బ్రహ్మంసాగర్‌ను నిండుగా నింపేందుకు సహకరించాలని సీఎం చంద్రబాబునాయుడు, నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడులను కోరారు. బ్రహ్మంసాగర్ నిర్మించినప్పటి నుంచి ఒక్క సారి కూడా పూర్తిగా నీటితో నింపలేదని, పూర్తిగా నింపేం దుకు గతంలో కుందూనది నుంచి లిఫ్ట్ ఇరి గేషన్ ద్వారా రూ.528 కోట్ల టెండర్లు పిలవడం జరిగిందని, కానీ పనులు ఇంతవరకు ప్రారంభం కాలేదన్నారు. బ్రహ్మంసాగర్‌ను నీటితో నిండుగా నింపగలిగితే బద్వేల్, మైదుకూరు నియోజకవర్గాలు పాడి పంటలతో సస్యశ్యా మలం అవుతాయని తెలిపారు. వెంటనే లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ప్రారంభించాలని కోరారు. అలాగే గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు బ్రహ్మంగారిమఠంలో డీకేటి భూములను అక్రమంగా ఆన్‌లైన్‌లో ఎక్కించుకు న్నారని తెలిపారు. దీనిపై కలెక్టర్ ద్వారా కమిటీని వేయించి విచారణ జరిపించాలని స్పీకర్‌ను కోరారు.

రబీ పంటలకు బీమా ఇవ్వని వైసీపీ

- తీవ్రంగా నష్టపోయిన రైతులు
- శాసనసమండలిలో ప్రస్తావించిన ఎమ్మెల్సీ

వేంపల్లె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో 2019 నుంచి 2024 వరకు నష్టపోయిన రైతులకు ఇన్సూరెన్స్ ఇచ్చిన దాఖలాలు లేవని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఇన్సూరెన్స్ ఇచ్చినట్లు నిరూపిస్తే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని మండలిలో ప్రకటించారు. ప్రశ్నోత్తరాల సమయంలో రైతులు ఎదుర్కొంటున్న ప్రధాని ఇన్సూరెన్స్ సమస్య గురించి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రైతుల ఇన్సూరెన్స్‌ను చెల్లిస్తామని చెప్పి పట్టించుకోకపోవడంతో రైతులకు తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. ప్రీమియం సక్రమంగా కట్టకపోవడం వల్ల నష్టపోయిన రైతులకు క్లెయిములు రాలేదన్నారు. జమ్మలమడుగు, పులివెందుల ప్రాంతంలో బుడ్డశనగ వేస్తారు, ఆ రైతులకు కూడా నష్టపోయిన సమయంలో ఒక్క రూపాయి కూడా ఇన్సూరెన్స్ రాలేదని తెలిపారు. నష్టపోయిన రైతులకు ఇన్సూరెన్స్ సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



పది పరీక్షల్లో విరామం... ఎంతో ఉపశమనం

కడప ఎడ్యుకేషన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశకు తొలి అడుగైన పదో తరగతి వార్షిక పరీక్షలు దగ్గరపడుతున్న కొద్దీ సహజంగా వారిలో ఒత్తిడి పెరుగుతుంది. అధిక శాతం విద్యార్థులు పగలు, రాత్రి కష్టపడి చదవి పరీక్ష రోజున మర్చి పోతుంటారు. దీంతో ఆశించిన మార్కులు రాక నిరాశకు లోనవుతారు. గతంలో విద్యార్థులు పడిన ఇబ్బందులను గమనించిన కూటమి ప్రభుత్వం నూతన విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఈ ఏడాది మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు జర గనున్న పదో తరగతి పరీక్షల్లో ఒక రోజు విరా మం ఉండేలా విద్యాశాఖ ప్రణాళిక రూపొందించింది. దీని వల్ల ఒత్తిడి తగ్గి ఉత్తీర్ణత శాతం పెరుగుతుందని భావిస్తున్నారు. ఈ విధానం అమలు చేయడం పట్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈ అవకాశాన్ని వినియోగంచుకుంటాం...



ఏడాదిలో పలు దఫాలుగా జరిగే సాధారణ పరీ క్షల సమయంలోనే కనిపించని ఒత్తిడి ఉంటుంది. అలాంటిది పబ్లిక్ పరీక్షల్లో ఉండడం సహజం. దాన్ని అధిగమించేందుకు విద్యాశాఖ అందించిన విరామ సమయాన్ని అవకాశంగా మలుచుకుంటాం.

-మానస, విద్యార్థిని.

ప్రతి నిమిషం ఎంతో ఉపయుక్తం



పరీక్షల వేల గంట సమయం కూడా ఎంతో విలువైనది అని తొలి నుంచి ఉపాధ్యాయులు చెబుతున్నారు. అలాంటిది ఇపుడు ఏకంగా 24గంటల సమయం దొరుకుతోంది. ఇది మార్కుల సాధనకు ఎంతో దోహదపడుతుంది. తద్వారా ఒత్తిడి నుంచి ఉపశమనం కలుగుతుంది.

-హరిణి, విద్యార్థిని.

విద్యార్థులకు వరం



రోజు విడిచి రోజు పరీక్షలు నిర్వహించడం విద్యార్థులకు వరమనే చెప్పాలి. గతంలో ఎప్పుడు ఇలాంటి అవకాశం కల్పించలేదు. దీన్ని వినియోగించుకొని ఏడాది మొత్తం చదివిన వాటిని మరో మారు గుర్తు చేసుకోవాలి. పరీక్షలకు వెళ్లే ముందు భయాన్ని విడిచి నమ్మకంతో ఉండాలి.

-మాబున్నీ, ఉపాధ్యాయులు, కడప.

పూర్తిస్థాయిలో దృష్టిసారిస్తారు



ప్రభుత్వం విద్యార్థులకు గొప్ప అవకాశం కల్పించింది. ప్రస్తుతం వంద మార్కులకు ఒకే పేపర్ ఇస్తున్నారు. కీలకాంశాలు, సూత్రాలపై దృష్టిపెట్టి పరీక్షలు బాగా రాసే అవకాశం ఏర్పడు తుంది. దీంతో పూర్తిస్థాయిలో దృష్టిసారించాలి.

-మేరీ, ప్రధానోపాధ్యాయని, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, చెమ్మూమియాపేట, కడప.

కస్తూర్బాగాంధీ పాఠశాలను తనిఖీ చేసిన జేసీ



భూమి రికార్డులను పరిశీలిస్తున్న జేసీ అదితిసింగ్

వల్లూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వల్లూరు కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను జాయింట్ కలెక్టరు అదితిసింగ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడున్న రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం స్థానిక ప్రత్యేక అధికారిణితో సమావేశమయ్యారు. పాఠశాలలో జరుగుతున్న వివిధ అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. బాలికల కోసం శ్రద్ధ వహించాలని.. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలను సాధించాలని సూచించారు. బాలికలకు కాస్మోటిక్స్, ఇతరత్రా వస్తువులు నెలనెలా సక్రమంగా అందుతున్నాయా అని అడిగారు. అలాగే మధ్యాహ్నం భోజనం అందిస్తున్నారా లేదా అని తెలుసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. ఆర్డీవో జాన్ ఎర్విన్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

వివాదాస్పద భూమిని పరిశీలించిన జేసీ

సీకేదిన్నె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగ్గలపల్లె పంచాయతీలోని వివాదాస్పద భూమిని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ మంగళవారం పరిశీలించారు. పోలిరెడ్డి లేపాక్షిరెడ్డి సోమవారం గ్రీవెన్‌సెల్‌లో ఫిర్యాదు చేయడంతో పరిశీలించేందుకు వచ్చినట్లు తెలిసింది. ఆర్‌హెచ్ ప్రకారం అనుభవంలో తమ పేరుతో ఉండే భూమి ఆన్‌లైన్‌లో మరొకరి పేరు ఎక్కడంతో వారు తన 5.20 ఎకరాల భూమిని ఎకరా రూ.60లక్షలతో అమ్ముకున్నారు. ఆ విషయం తెలిసి బాధితుడు ఫిర్యాదు చేయడంతో మంగళవారం ఆమె స్వయంగా పరిశీలించి న్యాయం చేస్తానని తెలిపారు.

బుగ్గ వంక ప్రాజెక్టు పనుల పరిశీలన



సమీక్ష నిర్వహిస్తున్న ఎస్ఈ అబ్దుల్ షమీ

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బుగ్గవంక ప్రాజెక్టు పనులను జయకా ఇంజనీరింగ్ వర్క్స్ కన్సల్టెంట్, రిటైర్డ్ సీఈ సజ్జాన్‌బాష మంగళవారం పరిశీలించారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ప్రాజెక్టు పనులను మరో ఐదేళ్ల పాటు పొడిగించాలని ప్రభుత్వానికి లేఖ రాశారు. ఇరిగేషన్ ఎస్ఈ అబ్దుల్ షమీతో కలిసి సమీక్ష నిర్వహించారు. జయకా నిధులతో చెరువులు అభివృద్ధి చేసుకోవచ్చు. వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి కూడా ప్రయోజనం కలుగుతుంది. ఇరిగేషన్ రెగ్యులర్ ఈఈ వెంకటరామయ్య, వెలిల్లు ఈఈ శ్రీనివాసులరెడ్డి, క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ మునీర్ బాష తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి



మియాపూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి చెందాడు. హైదరాబాద్‌లోని మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన సంఘటన వివరాలిలా ఉన్నాయి. కడప ప్రాంతానికి చెందిన జహర్‌బాను, అమర్‌బాష చిన్న కుమారుడు రోషన్ (27) మూడు సంవత్సరాలుగా చందానగర్‌లో ఉంటూ హైటెక్‌సిటీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి రోషన్ బయటకు వెళ్తున్నానని చెప్పి తన రూమ్ మేట్ భార్గవ్‌కు చెప్పి బుల్లెట్ వాహనంపై బయటకు వెళ్లాడు. చందానగర్ జాతీయ రహదారిపై మియాపూర్ వెళ్తుండగా దీప్తిశ్రీనగర్ వద్ద కమాన్ మలుపు వద్ద ముందువెళ్తున్న టిప్పర్‌ను ఓవర్ టెక్ చేయబోయి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రోషన్ తీవ్ర గాయాలతో అక్కడిక్కడే మృతిచెందాడు.

మాలేపాడు సర్పంచి చెక్‌పవర్ రద్దు

ఎర్రగుంట్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలేపాడు గ్రామ సర్పంచి కుప్పన్నగారి శకుంతలమ్మ చెక్‌పవర్‌ను మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి రద్దు చేశారు. గ్రామంలో ఆర్డీపీపీ సహకా రంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంటు నిర్వహణ కోసం ఆర్డీపీపీ నిధులు మంజూరు చేసింది. ఇందుకు సంబందించిన నిధులను గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండా 2021 నుంచి 2024 ఆర్థిక సంవత్సరంలో రూ.23,21,101 నిధులను డ్రా చేశారు. పంచాయతీ తీర్మా నం లేకుండా నిధులు డ్రా చేసినట్లు విచారణలో తేల డంతో డీపీవో చెక్‌పవర్ రద్దు చేసినట్లు ఈవోపీఆర్‌డీ రంతుల్లయ్య తెలిపారు. ప్రస్తుతం రద్దు చేసిన చెక్‌ప వర్‌ను ఈవోపీఆర్‌డీకి ఇచ్చారు.

రూ.2 కోట్లతో ఉడాయించిన వ్యాపారి?

ఖాజీపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఖాజీపేటలో కిరాణాషాపు నిర్వహిస్తున్న శివనాగరాజు రూ.2 కోట్లతో ఉడాయించాడు. ఇతను మూడేళ్ల క్రితం అనంతపురం జిల్లా నుంచి వచ్చి కిరాణాషాపు నడపుతూ ఉండేవాడు. మంగళవారం 'ఖాజీపేటలో పేలనున్న ఐపీ బాంబు' అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావడంతో రుణదాతలు షాపు వద్ద గుమికూడారు. నాగరాజు సమీప బంధువుతో దుకాణాన్ని తెరిపించారు. అందులో సరుకులు ఏమీ లేకపోవడంతో ఆశ్చర్యపడ్డారు. దుకాణం యజమాని పక్కా ప్రణాళికతో ఉడాయించినట్లు నిర్ధారించుకున్న రుణదాతలు కోర్టుకు వెళ్లనున్నట్లు తెలిపారు. నాగరాజుకు మాత్రం వ్యాపారంలో నష్టం రాలేదని, అంతా దోచుకుని దాచుకున్నాడని పలువురు ఆరోపిస్తున్నారు.

అనుమతిలేకుండా అబార్షన్లు, ఆపరేషన్లు... ఆసుపత్రి సీజ్





ఫ్లోరెన్స్ ఆసుపత్రిని సీజ్ చేసిన వైద్య అధికారులు, బాధితులతో మాట్లాడుతున్న ఆర్డీవో సాయిశ్రీ

ప్రొద్దుటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం విజయనగరం వీధిలో వైద్య ఆరోగ్యశాఖ అనుమతి లేకుండా అబార్షన్లు, అపరేషన్లు చేస్తున్న ఫ్లోరెన్స్ నైటింగేల్ ఆసుపత్రిని వైద్యఆరోగ్యశాఖ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. ఫ్లోరెన్స్ ఆసుపత్రికి కేవలం ఒక జనరల్ ఫిజీషియన్ వైద్య సేవలు అందించేందుకు అనుమతి తీసుకొని ఏకంగా మహిళలకు సాధారణ కాన్పులు, సిజేరియన్ ఆపరేషన్లు, అబార్షన్‌లు చేస్తున్నారు. దీంతో ఈ ఆసుపత్రిని 2021లోనే సీజ్ చేశారు. మళ్లీ 2023 ఏప్రిల్ 12న పర్మిషన్ తీసుకున్నారు. అప్పుడు కూడా జనరల్ ఫిజీషియన్‌కు వైద్యశాఖ నుంచి 6 పడకలకు అనుమతులు తీసుకున్నారు. గైనకాలజిస్టు సేవలకు దరఖాస్తు చేసుకున్నా అనుమతులు ఇవ్వలేదు. అయినా 2025 ఫిబ్రవరి నెలలో సిజేరియన్ ఆపరేషన్లు, సాధారణ కాన్పు లు, అబార్షన్‌లు చేసినట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు గుర్తించారు. ఆమేరకు మంగళవారం జిల్లా ఆర్‌బీఎస్‌కే పీవో రమేష్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి, డెమో భారతి, రమణమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్లు మణికుమార్ వెంకటేశ్వర్లు లీగల్ సెల్ అథారిటీ పాలేశ్వరరావులు కలిసి ఫ్లోరెన్స్ ఆసుపత్రిని సీజ్ చేశారు.

ఆర్డీవో సాయిశ్రీ విచారణ : ఫ్లోరెన్స్ నైటింగేల్ ఆసుపత్రిలో భావన అనే గర్భిణి 2025 ఫిబ్రవరి 24న చేర్చుకొని అనధికారికంగా ఆమెకు వారాహి ఆసుపత్రిలో వున్న లోకేశ్వర్ అనే వైద్యుని పిలిపించి సాధారణ ప్రసవం చేశారు. పుట్టిన బిడ్డను తల్లి భావన అనుమతి లేకుండా వారాహి ఆసుపత్రికి తీసుకెళ్లి అనేక పరీక్షలు నిర్వహించారు. ఆ తరువాత శిశువులో ఎటువంటి వృద్ధి లేనందున 2025 మార్చి 3న తల్లిదండ్రులు కర్నూలు కిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ మూడు రోజుల వైద్యం అందించినా శిశువు మరణించినట్లు భావన ఆర్డీవో సాయిశ్రీకి తెలిపారు. ఈ మేరకు ఫ్లోరెన్స్ నైటింగేల్ ఆసుపత్రి, వారాహి ఆసుపత్రిపై కలెక్టర్‌కు నివేదిక పంపనున్నట్లు ఆర్డీవో తెలిపారు. ఆర్డీవో వెంట తహసీల్దారు గంగయ్య ఆర్ఐ నాగమోహన్‌రెడ్డిలు వున్నారు.

రెడ్ క్రాస్ సొసైటీలో అకౌంటెంట్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కడప(వినాయకనగర్), మార్చి11 (ఆంధ్రజ్యోతి): రెడ్ క్రాస్ సొసైటీ కడప జిల్లా శాఖలో అకౌంటెంట్ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా సెక్రటరీ సురేశ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల వారు పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను ఈనెల 25వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా నగరంలోని మట్టి పెద్దపులి వద్ద ఉన్న రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో నేరుగా అందజేయాలన్నారు.

పూర్తి వివరాలకు 08562272829, 9441513490 నెంబరును సంప్రదించాలన్నారు. ఎంపికైన అభ్యర్థికి రూ.11,770 గౌరవ వేతనం ఉంటుందని, జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగే సమావేశంలో ఈ పోస్టుకు తగిన అభ్యర్థిని ఎంపిక చేస్తారని తెలిపారు. కనీసం రెండు సంవత్సరాల అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

గ్లకోమాపై అవగాహన ర్యాలీ



కడపలో అవగాహన ర్యాలీ చేస్తున్న దృశ్యం

కడప సెవెన్ రోడ్స్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ గ్లకోమా దినోత్సవం సందర్భంగా మంగళవారం కడపలో మహావీర్ సర్కిల్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కడపలోని పుష్పగిరి విట్రియోరెటీనా ఇనిస్టిట్యూట్, డీబీసీఎస్ సమన్వయంతో గ్లకోమాపై ఏర్పాటు చేసిన ర్యాలీని డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవి బాబు, డీపీఎం డాక్టర్ సునీత జెండా ఊపిప్రారంభించారు.

ఈ సందర్భంగా డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ క్రమం తప్పకుండా తనిఖీ చేయడం వల్ల నిశ్శబ్ద కిల్లర్ గ్లోకోమాను నివారించవచ్చని తెలిపారు. డాక్టర్ దినేష్ గ్లకోమా శస్త్రచికిత్సలపై మాట్లాడారు. ర్యాలీ సందర్భంగా పుష్పగిరి కంటి ఆసుపత్రి వారు గ్లోకోమాపై అవగాహన కరపత్రాలను పంపిణీ చేశారు.

పట్టించుకోరా..?



పులివెందులలోని కడప రింగురోడ్డులో వెలుగుతున్న లైట్లు

పులివెందుల రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తాను అనుసరించి తర్వాత మరొకరికి చెబితే ఎవరైన మాట వినే అవకాశం ఉంటుంది. బాధ్యత గల అధికారులే తమ బాధ్యతను మరిచి వృథా చేస్తే, సకాలంలో పన్నులు కట్టాలని ఇంటింటికి తిరగడం, చెత్తను రోడ్లపై వేయకూడదు, నీటిని వృథా చేయకూడదని ప్రకటనలు చేస్తుంటారు మున్సిపల్ అధికారులు. ఇది తమకు వర్తించదు అన్నట్లు ఉంది మున్సిపల్ అధికారుల తీరు. ఇప్పటికే విద్యుత్ సంస్థకు మున్సిపాలిటీ దాదాపు రూ.20 కోట్ల నుంచి రూ.30కోట్ల వరకు విద్యుత్ బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఈ బకాయిలను చెల్లించేందుకు మున్సిపాలిటీ అధికారులు నానాతంటాలు పడుతున్నారు. అసలే వేసవి కాలం. విద్యుత్ డిమాండ్ పెరిగే అవకాశం ఉంటుంది. ఈ సమయంలో విద్యుత్‌ను ఆదా చేయాలనే ఆలోచన వీరికి లేనట్లుంది. పులివెందుల పట్టణం కడప రింగురోడ్డు సర్కిల్ వద్ద హైమాస్ట్ లైట్లు, శిల్పారామానికి వెళ్లే దారిలో డివైడర్ మధ్యలో మిట్టమధ్యాహ్నం లైట్లు వెలుగుతూ కనిపించాయి. దీనిపై మున్సిపాలిటీ అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకున్న పాపాన పోలేదని ఆ ప్రాంతంలోని ప్రజలు చెబుతున్నారు.

ఇంకెంత కాలం..?

700 మీటర్ల రోడ్డు వేసేందుకు ఏడేళ్ల నుంచి ఎదురుచూపులు ●అధ్వానంగా చెన్నూరు-రామనపల్లె మట్టిరోడ్డు



గుంతలమయమైన రామనపల్లె నుంచి చెన్నూరుకు వెళ్లే మట్టిరోడ్డు

చెన్నూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : అధికారులు వస్తున్నారు, పోతున్నారు. అయినా ఇప్పటికీ గ్రామీణ ప్రజల సమస్యలు మాత్రం తీరలేదు. అలాగే పరిష్కరించేవారు కోసం ఎదురు చూసే పరిస్థితి నెలకొంది. ఏళ్లతరబడి అడుగుతున్నా పట్టీ పట్టనట్లుగా ఉంటున్నారు తప్ప ప్రజల బాధలను పట్టించుకునేవారు లేరంటూ మండలంలోని ఐదు గ్రామాల ప్రజలు అధికారులను, ప్రజాప్రతినిధులను ప్రశ్నిస్తున్నారు. ఇందుకు సంబంధించి ప్రజలు పడే ఆవేదన ఇది. మండల కేంద్రమైన చెన్నూరు నుంచి రామనపల్లెకు వ్యవసాయ పొలాల్లో చాలా ఏళ్లుగా మట్టిరోడ్డు ఉంది. దీని దూరం కేవలం 700 మీటర్లే. అధికారం మారినప్పుడల్లా మట్టి రోడ్డు వేసి చేతులు దులుపుకుంటారు. వేసిన రోడ్డు వర్షాలకు పనికిరాకుండా కనుమరుగైపోతోంది. చివరికి గుంతలు మిగిలి ప్రజలు వాటిలో పడి ఇబ్బందులు పడుతున్నారు. శాశ్వతంగా ఈ దారికి సిమెంటు రోడ్డునో, తారురోడ్డునో కనీసం కంకర రోడ్డు అయినా వేయాలని ప్రజలు నెత్తి నోరు బాదుకుంటున్నా వేస్తాం, చూస్తాం అనడం తప్ప ఇప్పటికీ వేసిన దాఖలాలులేవు. పోయిన ప్రభుత్వం ఆర్భాటంగా గ్రామీణ రోడ్లకు మహర్దశ కల్పిస్తాం, నిధులు ఇస్తాం, గుంతలు లేకుండా చేస్తాం. అద్దాల్లా రోడ్లను మారుస్తాం అని గాలిమాటలు చెప్పారే తప్ప పనులు ఏ మాత్రం అంగుళం కూడా జరగలేదు. అందుకు ఉదాహరణే ఈ చెన్నూరు నుంచి వ్యవసాయ పొలాల గుండా రామనపల్లె వెళ్లే దారి.ఈదారి చెన్నూరులోని సీహెచ్‌సీకి రావాలంటే చాలా దగ్గర దారి. ఈ దారి గుండా మండలంలోని రామనపల్లె, రాచిన్నాయనపల్లె, ముండ్లపల్లె, ఓబులంపల్లె, గుర్రంపాడు ప్రాంత ప్రజలు ఆరోగ్యం కోసం ఏ సమస్య ఉన్నా వస్తుంటారు. ఈ రోడ్డు వర్షాకాలం మాత్రం ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి అటుంచి కనీసం నడకకు కూడా వీలు లేని విధంగా ఉంటుంది. ఈ దారి కేవో ఆర్‌కాలనీ నుంచి మొదలవుతుంది. ఈ దారి మొదట్లో ఇటుక బట్టీలు ఉండడంతో నిత్యం వాహనాలుమట్టిని తీసుకుని తిరుగుతూ కొంత దూరం దారి పనికిరాకుండా పూర్తి దుమ్ముగా మారింది. దీంతో నడవాలన్నా దుమ్ము లేచి దారిన తిరిగేవారిని ఇబ్బంది పెడుతుంది. అలాగే ఇదే దారి అటు రామనపల్లె రోడ్డుకు కలిసేటప్పుడు గుంతలమయమైంది. ఇలాంటి రోడ్డును బాగు చేయండి మహాప్రభో అని ఆయా గ్రామాల ప్రజలు ఎన్నోమార్లు అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులను వేడుకుంటున్నా పట్టించుకున్న పాపాన పోలేదు.

అంచనాలు తయారుచేస్తున్నాం



రామనపల్లె, చెన్నూరు మధ్య ఉన్న మట్టిరోడ్డుకు తారురోడ్డు, కంకర రోడ్డు కానీ వేసేందుకు అంచనాలు తయారు చేస్తున్నా. త్వరలో నిధులు మంజూరు కావచ్చు. ప్రజల సమస్యలు తీరవచ్చు. గతంలో అంచనాలు వేసినా అప్పట్లో ఎందుకు పక్కన పెట్టేశారో తెలియదు. ఇప్పుడైతే రోడ్డు కచ్చితంగా వేసే అవకాశం ఉంది.

- మల్లికార్జున, ఏఈ, పంచాయతీరాజ్, చెన్నూరు

స్వార్థ రాజకీయాల కోసం యువత బలి కావద్దు

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తు పట్ల కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, వైసీపీ స్వార్థ రాజకీయాల కోసం యువత బలికావద్దని టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ తెలిపారు. మంగళవారం కడప నగరం మాసాపేట టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జీఓ నెంబర్ 77ను తీసుకొచ్చింది. వైసీపీ ప్రభుత్వమని అదే జీఓలు ఇపుడు రద్దు చేయమని చెప్పడం దారుణమని తెలిపారు. విద్యార్థుల పరీక్షల సమయంలో పోరుబాట పేరుతో వారి భవిష్యత్తుతో వైసీపీ చెలగాట మాడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు లోకేష్ మీడియా కోఆర్డినేటర్ విశ్వనాథ్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న పద్మ

కడప ఎడ్యుకేషన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయంలో రక్తదాన శిబిరానికి విస్తృత స్పందన లభించింది. మంగళవారం వైవీయూ ఆరోగ్య కేంద్రంలో విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవం, కళాశాల ఉత్సవంలో భాగంగా జాతీయ సేవా పథకం-9, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (రిమ్స్ కడప) ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. విశ్వవిద్యాలయ ప్రధాన ఆచార్యుడు ఎస్.రఘునాథరెడ్డి, కులసచివులు ఆచార్య పి.పద్మ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన యువత ప్రతి ఆరు మాసాలకు ఒకసారి రక్తదానం చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ రాజేంద్ర, విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.వెంకటరామిరెడ్డి, జాతీయ సేవా పథకం-9 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె.శ్రీనివాసరావు, విశ్వవిద్యాలయ డాక్టర్ నరేష్‌కుమార్‌రెడ్డి, వైద్య సహాయకులు రెడ్డిబాష, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకు సాగు నీరు అందించటమే లక్ష్యం



నీటిని విడుదల చేస్తున్న జోగిరెడ్డి

సింహాద్రిపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఎకరాకు సాగు నీరు అందించే దిశగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని తుంగభద్ర ప్రాజెక్ట్ హైలెవెల్ కెనాల్ ఛైర్మెన్ మారెడ్డి జోగిరెడ్డి పేర్కొన్నారు. మంగళ వారం మండలంలోని చెర్లోపల్లి పంప్ హౌస్ నుంచి జలవనరులశాఖ అధికారులతో కలసి గ్రావిటీ ద్వారా కాలువలకు నీటిని విడుదల చేశారు.చెర్లోపల్లి పంప్ హౌస్‌నుంచి మోటార్లు తోడే నీటితో సింహాద్రిపురం, లింగాల, వేంపల్లి మండలాలకు ఆయకట్టుకు సాగునీరు అందనుంది. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసి పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సాగునీటి సంఘం డిస్ట్రిబ్యూటరీ సభ్యుడు సూర్యనారాయణ రెడ్డి, పీబీసీ ఈఈ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరపై సీఎం యాప్‌లో నమోదు చేసుకోవాలి

కమలాపురం రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మద్దతు ధరకే కంది, మినుము, శనగ ఉత్పత్తులు అమ్ముకోవడానికి ప్రతి రైతు ముందుగా సీఎం యాప్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని చెన్నారెడ్డిపల్లె గ్రామం చిన్నచెప్పలి గ్రామ పొలాల్లో మండల వ్యవసాయాధికారి సరస్వతి ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ పంట నమోదు జాబితాను సామాజిక తనిఖీ కోసం ప్రతి రైతు సేవాకేంద్రంలోనూ మార్చి 8 నుంచి 18వతేదీ వరకు ప్రదర్శించడం జరుగుతుందన్నారు. ఈ నెల 18 వరకు ఈ పంట నమోదు జాబితాలో రికార్డుల సవరణ కోసం ఫిర్యాదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వ కొనుగోలు ధరలు క్వింటా ధర నువ్వులు రూ.7400, శనగ రూ.5650, కందులు రూ.7550 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి దస్తగిరి, గ్రామ సహాయ వ్యవసాయకురాలు సుప్రియ, మరియు రైతులు పాల్గొన్నారు.

16న సర్వసభ్య సమావేశం, ర్యాలీ

కడప(వినాయకనగర్), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జీవోసీ, టాకా ఆధ్వర్యంలో ఈ నెల 16న ఆదివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం, నగరంలో ర్యాలీ ఉంటుందని జిల్లా మాజీ సైనిక బిల్డింగ్ కోఆపరేటివ్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు ఫిలిప్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యుల సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. ర్యాలీలో ఈసీహెచ్‌ఎస్ మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంతవరకు ఇంటి స్థలాలు పొందని వారు తప్పనిసరిగా ర్యాలీకి హాజరై తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కడప మారుతీనగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ఆర్టీసీ ఆర్‌ఎం గోపాల్‌రెడ్డి డ్రైవర్లకు సూచించారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయ సభాభవనంలో డ్రైవర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ కడప డిపో మేనేజరు ఢిల్లీశ్వర్‌రావు, ట్రాఫిక్ ఎస్‌ఐ పాల్గొన్నారు.

నేడు ఖోఖో సెలక్షన్లు

సీకేదిన్నె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలం బయనపల్లి శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి జిల్లాస్థాయి ఖోఖో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఖోఖో సంఘం జిల్లా అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, కార్యదర్శి నరేంద్ర తెలిపారు. పురుషులు, మహిళల ఎంపికలు బుధవారం జరుగుతాయన్నారు. ఈనెల 14, 15 తేదీల్లో పురుషులకు, 16 మహిళలకు బాపట్లజిల్లా జె.పంగలూరు క్రీడా మైదానంలో జాతీయ సెలక్షన్ల ఎంపికలు జరుగుతాయన్నారు.

నాటుసారా మానేద్దాం

పులివెందుల టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నాటుసారా మానేద్దాం, ఆరోగ్యాన్ని కాపాడుకుందాం అని తహసీల్దారు మహ్మద్ నజీర్, ఎక్సైజ్ చెన్నారెడ్డి, పట్టణ సీఐ నరసింహులు అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో నాటుసారా నిర్మూలన పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జీఓ 107, 108ని రద్దు చేయాలి

కడప సెవెన్ రోడ్స్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జీఓ 107, 108లను రద్దు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.వలరాజు పేర్కొన్నారు. కాగా మంగళవారం రిమ్స్ లో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులుప్రభుత్వ విధానాల వ్యతిరేకంగా నిరసన చేశారు. జిల్లా అధ్యక్షుడు శివ శంకర్, నగర కార్యదర్శి తేజ, జిల్లా ఉపాధ్యక్షులు అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి



చెక్కులు అందిస్తున్న ఉమాదేవి

పులివెందుల టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు అండగా నిలుస్తుందని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి సతీమణి ఉమాదేవి అన్నారు. పట్టణం లోని స్థానిక నివాసంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి 17 మందికి రూ.14,58,091ల చెక్కులను అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదుపై గ్రామసభ

వేముల,మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లచెరువుపల్లె రైతు సేవా కేంద్రం పరిధిలోని రబీ సీజన్‌కి సంబంధించి ఈ-పంట నమోదుప్రక్రియకు సంబంధించిన గ్రామసభను మంగళవారం నిర్వహించారు. ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గ్రామసభ ఆర్‌ఎస్‌కే కేంద్రం ఇన్‌చార్జి నాగసుదర్శన్ రైతుల వివరాలను చదివి వినిపించారు. అనంతరం జాబితాను ప్రదర్శించారు. ఏఓ చెన్నారెడ్డి, టెక్నికల్ ఏఓ సునీల్‌కుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ జాబితాపై అభ్యంతరాలు తెలియజేయండి

లింగాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్ 2024-25లో పంటలలు సాగుచేసిన రైతుల వివరాలను ఆయా రైతు సేవ కేంద్రాలలో ఈ-క్రాప్ జాబితాను సామాజిక తనిఖీ కోసం ప్రదర్శిస్తున్నట్లు పులివెందుల ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. లింగాల మండలం మురారిచింతల రైతు సేవ కేంద్రంలో ఈ-క్రాప్ జాబితాను ప్రదర్శించారు. రైతులు తమ అభ్యంతరాలను 18లోగా తెలియజేయాలని, తుదిజాబితాను 22న ప్రదర్శిస్తామని తెలిపారు. ఏఓ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

బోనాల చెరువుకు నీరు విడుదల

లింగాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోనాల గ్రామంలోని చిన్నబావి చెరువుకు అధికారులు లింగాల కుడికాల్వ నుంచి ఎత్తిపోతల ద్వారా మంగళవారం నీటిని విడుదల చేశారు. గత వారం నీటిని విడుదల చేసేందుకు ప్రయత్నం చేయగా పంపు మొత్తం బురదపేరుకుపోయి సాధ్యం కాలేదు. పంప్‌నకు మరమ్మతు నిర్వహించి నీటిని విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా హోమాలు, పూజలు



లఘు పూర్ణాహుతిలో పాల్గొన్న పుత్తా కుటుంబీకులు

వల్లూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు మాచిరెడ్డిపల్లె గ్రామంలో తెల్లవారు జామున నుంచి పూజలు మొదలయ్యాయి. ముందు గా మూలవిరాట్ లక్ష్మీనరసింహస్వామి, ఉత్స వ విగ్రహాలకు విశేషంగా పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి సంబంధించి భగవాన్ నరసింహ మూలమంత్ర సహిత నృసింహ గాయత్రి హోమాలు ప్రారంభించారు. ముందుగా పుత్తా కుటుంబీకులచే గణపతి హోమం ప్రారంభించారు. అనంతరం వివిధ హోమాలు నిర్వహించి లఘు పూర్ణాహుతి చేపట్టారు. భక్తులందరికీ తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి సతీమణి సరళమ్మ, ఆయన కుమారుడు ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి, ఆయన సతీమణి చైతన్యరెడ్డి, పుత్తా సోదరుడు రామచంద్రారెడ్డి దంపతులతో పాటు యువ నాయకుడు సాయినరసింహారెడ్డి పూజలు, హోమాలు నిర్వహించారు. అలాగే ఉదయం కోలాటం పోటీలు ప్రారంభించారు. గెలిచిన వారికి ఈ నెల 14వతేదీన సాయంత్రం నగదు బహుమతులు అందిస్తామని పుత్తా తెలిపారు. అలాగే బుధవారం వివిధ హోమాలు, జపాలు ఉంటాయని, సాయంత్రం లక్ష్మీ సహస్ర నామ కుంకుమార్చన ఉంటుందన్నారు. రాత్రి 9కి రంగస్థల పద్యాల పోటీలుంటాయని పాల్గొనేవారు ఉదయాన్నే తమ పేర్లను దేవస్థానం వద్ద నమోదు చేసుకోవాలని తెలిపారు

నేడు యువత పోరు



మాట్లాడుతున్న అంజాద్ బాష

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ వసతి దీవెన బకాయిలు వెంటనే చెల్లించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష డిమాండ్ చేశారు. బుధవారం జరిగే యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మంగళవారం కడపనగరంలో మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష కార్యాలయంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం మేయర్ సురేష్‌బాబు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మాట్లాడారు. వైసీపీ డివిజన్ ఇన్‌చార్జిలు, వైసీపీ అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

విజయదుర్గాదేవి సన్నిధిలో రాహు కాల పూజలు



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న మహిళలు

కడప కల్చరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బిల్టప్ సమీపంలోని శ్రీ విజయదుర్గాదేవి అమ్మవారి ఆలయంలో మంగళవారం రాహుకేతు పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4-30 గంటల వరకు రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో పూజలు చేయడం వలన ఆ తల్లి చల్లని అనుగ్రహం తప్పక లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. కాగా ఈనెల 14న పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, హోమం, దీపాలంకారసేవ నిర్వహిస్తారు. అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందాలని ఆలయ వ్యవస్థాపకుడు మల్లికార్జునరావు, నిర్వాహకుడు దుర్గాప్రసాద్ తెలిపారు.

ఈఓను నియమించాలి

వేంపల్లె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మేజర్ పంచాయతీకి వెంటనే ఈఓను నియమించాలని టీడీపీ మండల కన్వీనర్ మునిరెడ్డి కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందజేశామన్నారు. ఇక్కడున్న ఈఓ సస్పెండ్ కావడంతో పారిశుధ్యం, తాగునీరు ఇతర నిర్వహణ పనులు కుంటుపడే అవకాశం ఉందని వెంటనే నియమించాలని కోరారు. అలాగే 2016-2018 కాలంలో పంచాయతీ లో అవినీతి జరిగిందని విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినట్లు తెలిపారు.

కష్టపడ్డ వారికి బీజేపీలో గుర్తింపు

వేంపల్లె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కష్టపడి పనిచేసే నాయకులకు బీజేపీలో తగిన గుర్తింపు ఉంటుందని సోమువీర్రాజుకు ఎమ్మెల్సీ రావడమే అందుకు నిదర్శనమని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ తెలిపారు. వేంపల్లెలో బీజేపీ నాయకులు సంబరాలు చేసుకొని స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు సుష్మ, దొంతు సుమన్, ఈశ్వర్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సునీల్, చంద్ర, చరణ్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఎంత చెప్పినా .. తీరు మారదంతే..!

కల్వర్టును వెనక్కి మార్చకుండా మరమ్మతులతో వదిలేశారు



చెన్నూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు సమీపంలోని హైవేలో సబ్ స్టేషను ఎదురుగా ఉన్న కల్వర్టు ప్రమాదాలకు నిలయంగా మారింది. తరచూ ఈ కల్వర్టును ఢీకొని ద్విచక్ర వాహనదారులతో పాటు పలురకాల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కాసింత వెనక్కి కట్టండని చెప్పినప్పటికీ హైవే అధికారుల తీరు మారక యథాస్థానంలో మరమ్మతులు చేపట్టడంతో మండల ప్రజలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఇటీవల పలుమార్లు ఈ కల్వర్టును పలురకాల వాహనదారులు ఢీకొనడం జరిగింది. పలువు రు గాయాలపాలయ్యారు. దీంతో ప్రజలు రోడ్డులో ఫుట్‌పాత్ వరకు కల్వర్టు గోడ ఉందని, దానిని కనీసం ఐదు అడుగులైనా వెనక్కి సర్ది కట్టాలని ప్రజలు డిమాండ్ చేశారు. అయినప్పటికీ రెండు దఫాలుగా కల్వర్టుకు మరమ్మతులు చేశారు తప్ప దానిని సర్ది కట్టాలన్న ఆలోచన మాత్రం చేయలేదు. ఎంత చెప్పినా ఇంతేనా, వీరి తీరు మారదా అని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఇంజనీరింగ్ అధికారులు స్పందించి వెనక్కి సర్ది కట్టాలని లేదంటే భవిష్యత్తులో మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కల్వర్టును వెనక్కిమార్చకుండా మరమ్మతు చేస్తున్న దృశ్యం

జ్యోతీక్షేత్రాన్ని పోరాటంతోనే సాధించుకోవాలి

కాశినాయన మార్చి11(ఆంధ్రజ్యోతి):అవధూత కాశిరెడ్డినాయన జ్యోతీ క్షేత్రాన్ని భక్తులు పోరాటంద్వారానే సాధించుకోవాలని అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయ్ శంకర్ స్వామి పిలుపునిచ్చారు..మంగళవారం ఆయన జ్యోతీక్షేత్రాన్ని సందర్శించి కాశినాయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సమీపంలో అటవీ శాఖవారు కూలదోసిన పలు నిర్మాణాలను పరిశీలించి మాట్లాడుతూ ఇప్పటికే మూడు దఫాలుగా నిర్మాణాలను అటవీ శాఖవారు గుట్టుచప్పుడు కాకుండా కూల్చారన్నారు.. కాశినాయన భక్తులు మేల్గొని పాలకులకు కనువిప్పు కల్గేలా పోరాటాలు చేయాల్సిన అవసరంఉందన్నారు.ఇందులో భాగంగా ఈనెల 17న కడప కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాకు యావంత్ భారత్‌లో ఉన్న కాశినాయన ఆశ్రమాల పీఠాధిపతులు, నిర్వాహకులు, భక్తులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జయభారత్ జాతీప్రదానకార్యదర్శి లోక్‌నాథ్, కాశినాయన భక్తులు పాల్గొన్నారు.

నిర్మాణాలను కూల్చడం సరికాదు

కాశిరెడ్డి నాయన జ్యోతీక్షేత్రంలో నిర్మాణాలను కూల్చడం సరికాదని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల పేర్కొన్నారు.మంగళవారం ఆమె జ్యోతీక్షేత్రాన్ని సందర్శించారు. భక్తులు ఐకమత్యంతో పోరాడి జ్యోతిక్షేత్రాన్ని సాధించుకోవాలని కోరారు. వైసీపీ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి,జిల్లా యాక్టివ్ కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ప్రదానకార్యదర్శి పోలిరెడ్డి పాల్గొన్నారు.

హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ చేయించుకోవాలి

గోపవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గోపవరం మండల ప్రజలు వెంటనే హౌస్ హోల్డ్ మ్యాపింగ్ చేయించుకోవాలని ఎంపీడీవో రామనాధరెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇంత వరకు హౌస్ హోల్డ్ మ్యాపింగ్ చేయించుకోని వారు వెంటనే చేయించుకోవాలన్నారు. రానున్న సమయంలో హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ చేయించుకోని వారికి ప్రభుత్వ పథకాలు సకాలంలో పొందే అవకాశం ఉండదన్నారు. బాధితులు సమీపంలో ఉన్న సచివాలయంలోకి వెళ్లి హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ చేయించుకోవాలని ఆయన సూచించారు.

మెరుగైన వైద్యసేవలు ఎక్కడ?

- కోట్లు వెచ్చించి నిర్మించిన బద్వేలు ప్రభుత్వ వైద్యశాల
- వేధిస్తున్న వైద్య సిబ్బంది కొరత, పనిచేయని యంత్రాలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ప్రజారోగ్యంపై చిత్తశుద్ధిలేదంటున్న ప్రజలు
- ఇక్కట్లు పడుతున్న రోగులు



నిరుపయోగంగా ఉన్న వెంటిలేటర్స్



బద్వేలులోని 50 పడకల ప్రభుత్వాసుపత్రి

బద్వేలుటౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : పైన పటా రం, లోనలొటారం అనే నానుడుకి బద్వేలులోని ప్రభు త్వ సామాజిక వైద్యకేంద్రానికి సరిపోతుంది. కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి అందంగా భవనాలు నిర్మించి 50 పడకలు ఏర్పాట్లు చేసినా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందడంలేదు. వైద్యశాలలో తగినంత మంది వైద్యులను నియమించకపోవడంతో అత్యవసర చికిత్సలతోపాటు బద్వేలు మున్సిపాలిటీ పరిధిలో సుమారు 87వేల మంది జనాభా, పంచాయతీల పరిధిలో 40వేలపైనే జనాభా ఉంది. వారితోపాటు బద్వేలు ఆసుపత్రి పరిధిలో మరో 20పంచాయతీలున్నాయి. ఈ ఆసుపత్రికి రోజుకు 300 నుంచి 400 మంది రోగులు వస్తుంటారు. అయితే అక్కడ సరైన పరికరాలు లేక, ఉన్నవి పనిచేయక ప్రజలకు సరైనవైద్యం అందక, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోంది. పేరుకే బద్వేలు 50పడకల ఆసుపత్రి అయినా అందులో 12మంది వైద్యులు ఉండాల్సి ఉండగా, 6మంది మాత్రమే వైద్యసేవలు అందిస్తున్నారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, చిన్నపిల్లల వైద్యులు, గైనకాలజిస్ట్ లేరు. ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యసేవలు అందిస్తామని నాయకులు వాగ్దానాలు చేశారే తప్ప, వైద్యులను నియమించడం లోకానీ, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక లక్ష్యం నెరవేరడంలేదు.

పరికరాలు ఉన్నా నిరుపయోగం :

లక్షల రూపాయలు వెచ్చించి బద్వేలు ప్రభుత్వ వైద్యశాలలో 5వెంటిలేటర్లు, 50 బెడ్లు ఏర్పాటు చేశారు. అయితే వెంటిలేటర్లు వినియోగించుకునేందుకు ఆ విభాగానికి సంబంధించిన వైద్యులు లేకపోవడంతో యంత్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఆల్ట్రాస్కానింగ్ మిషన్ మరమ్మతుల్లో ఉంది. గైనకాలజిస్ట్ వారంలో రెండు రోజులు మాత్రమే అందుబాటులో ఉండడం ఎప్పుడు వస్తారో? తెలియక గర్భిణులు నిరాశతో వెనుతిరిగి ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోందంటున్నారు. అలాగే చెవి, ముక్కు, గొంతుకు సంబంధించి వైద్యులు అందుబాటులో ఉన్నా, సంబంధిత పరికరాలు అందుబాటులో లేకపోవడంతో వచ్చిన రోగులకు పూర్తిస్థాయిలో చికిత్స చేయలేక మందులతో సరిపెడుతున్నారు. అలాగే కంటి వైద్యనిపుణులు గురు, శనివారాలు మాత్రమే అందుబాటులో ఉంటున్నా విషయం ప్రజలకు తెలియక వెనుతిరుగుతున్నారు. నియోజకవర్గంలోనే ఇది పెద్దాసుపత్రిగా పేరు పొందినప్పటికీ సరైన వైద్యసేవలు అందడంలేదు. ఇప్పటికైనా బద్వేలు ప్రభుత్వాసుపత్రిలో ఉన్న యంత్రాలను మరమ్మతులు చేయడంతో పాటు వైద్యుల కొరత లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

అన్నివేళలా సేవలు అందిస్తాం

సిబ్బంది కొరత ఉన్నా రోగులకు అన్నివేళలా వైద్య సేవలు అందిస్తున్నాం. వైద్యుల కొరత ఉందని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం, వైద్యులను నియమిస్తే పూర్తిస్థాయిలో ప్రజలకు వైద్యసేవలను అందించవచ్చు. అత్యవసర కేసులకు 24 గంటలు అందుబాటులో ఉంటాను, అత్యవసరమైతే 7893435783 నెంబర్‌కు ఫోన్‌చేస్తే పదినిమిషాల్లో ఆసుపత్రికి వచ్చి సేవలు అందిస్తున్నాం.

-డాక్టర్ సుబ్బారెడ్డి,
ప్రభుత్వాసుపత్రి సూపరెంటెండెంట్, బద్వేలు

ఇంటి పన్నులు వంద శాతం వసూలు చేయాలి

మైలవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారిణి రాజ్యలక్ష్మి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం మండల పరిధిలోని వేపరాల, దొమ్మరనంద్యాల, మైలవరం, గ్రామ పంచాయతీల్లో ఆమె పర్యటించి గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం పనితీరుపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. గ్రామాల్లో తడి, పొడి వ్యర్థాలను వేర్వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందజేయాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో వర్మీ కంపోస్టు తయారు చేసి రైతులకు అమ్మి గ్రామ పంచాయతీ అవసరాలకు ఉపయోగించుకోవాలన్నరు. కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘర్షణలపై విచారణ చేసిన డీఎస్పీ

పోరుమామిళ్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోరని రంగసముద్రం పంచాయతీ పరిధిలోని 1001 సర్వేనెంబరులో ఇటీవల జరిగిన ఘర్షణలకు సంబంధించిన వివరాలను మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ విచారణ జరిపారు. ఇటీవల ఆ స్థలం కోసం కొందరు తమకు పత్రాలు ఉన్నాయని కొందరు ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్నామని ఘర్షణ పడడంతో పలువురికి గాయాలయ్యాయి. జరిగిన సంఘటనలపై పూర్తి విచారణ జరిపేందుకు మంగళవారం మైదుకూరు డీఎస్పీ అక్కడున్నవారిని విచారించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పన్ను కట్టలేదని దుకాణం సీజ్

ఎర్రగుంట్ల, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల మెయిన్ బజార్‌లో ఓ వాణిజ్య భవనానికి యజమాని పన్ను కట్టలేదని నగరపంచాయతి కమిషనర్ పేర్లిశేషపణి ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది మంగళవారం సాయంత్రం సీజ్ చేశారు. డోర్‌నెంబరు 1-1-10 దుకాణ యజమాని ఏడు సంవత్సరాలుగా పన్ను కట్టలేదన్నారు. నగరపంచాయతి పరిధిలోని ఇంటి, దుకాణం యజమానులు ఇంటి, నీటి పన్నుల తక్షణమే చెల్లించాలని కమిషనర్ ప్రజలను కోరారు.

యాలి వాహనంపై వేంకటరమణుడు



బద్వేలు రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లక్ష్మిపాలెం లో ఉన్న శ్రీలక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి యాలి వాహనంపై వేంకటరమణుడు గ్రామ పురవీధుల్లో ఊరేగాడు. ఈ కార్యక్రమాలకు పట్టణ గ్రామీణ ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

నకిలీ వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నకిలీ వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్టాండర్డ్ క్లబ్ సభ్యుడు డీ వీసుబ్బానాయుడు పేర్కొన్నారు. మంగళవారం తాళ్లమాపురం జడ్పీ హైస్కూలులో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ ఆధ్వర్యంలో స్టాండర్‌క్లబ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం రఘురామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జానపదులు జ్ఞాన నిధులు

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జానపదులు జ్ఞాన నిధులని విద్వాన్ డాక్టర్ మూలె రామమునిరెడ్డి పేర్కొన్నారు. ఈనెల 8, 9, 10 తేదీల్లో తిరుపతి సంస్కృత విశ్వవిద్యాలయంలో జానపద జాతీయ సదస్సులో డాక్టర్ రామమునిరెడ్డి రాయలసీమ జానపద కళావైభవం అన్న అంశంపై పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయనను నిర్వాహకులు దుశ్శాలువాతో సత్కరించారు.

విద్యార్థినుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



పాఠశాలలో విచారణ చేస్తున్న ఏపీసీ నిత్యానందరాజు

కలసపాడు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో చదివే విద్యార్థినుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని సర్వశిక్ష అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ నిత్యానందరాజు హెచ్చరించారు. సోమవారం రాత్రి కలసపాడు మండలం పెండ్లిమర్రి సమీపంలోని కస్తూర్బా పాఠశాల భవనంపై నుంచి పడి గాయపడిన భార్గవి అనే పదో తరగతి విద్యార్థిని విషయంపై మంగళవారం పాఠశాలలో ఆయన విచారణ జరిపారు. ఉపాధ్యాయులు అక్కడి సిబ్బంది, విద్యార్థినులతో ఘటనపై విచారించారు. ఈ నివేదికను కలెక్టర్‌కు పంపుతున్నట్లు తెలిపారు. బీసీడీఓ అనిత, ఎస్‌ఏఎంఓ కల్పన, బీఏఎంఓలు వీరేంద్ర, విజయభాస్కర్, ఎంఈఓ మస్తాన్ వలి ఉన్నారు. కాగా విద్యార్థిని భార్గవి ఆత్మహత్యయత్నంకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకుడు అభిలాష్ డిమాండ్ చేశారు. మంగళవారం పాఠశాలలో విచారణకు వచ్చిన జిల్లా అధికారులను ఏబీవీపీ నాయకులు కలిసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

గుండెపోటుతో వీఆర్‌ఏ మృతి

కొండాపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లప్రొద్దుటూరు గ్రామానికి చెందిన వీఆర్‌ఏ పిక్కిలి చిన్నఓబులేసు (60) మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడని కుటుంబసభ్యులు తెలిపారు. ఇతనికి భార్యతో పాటు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. తాళ్లప్రొద్దుటూరులో ఇతని భౌతికకాయాన్ని సందర్శించి తహసీల్దార్ గురప్ప, సిబ్బంది నివాళులర్పించారు.

తాగునీటి సమస్యపై అధికారుల ఆరా

దువ్వూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో తాగునీటిపై అధికారులు అయిదు గ్రామాల్లో పర్యటించి ఆరా తీశారు. మండలంలోని ఇడమడక, నారాయణపల్లి, ఐ.బయనపల్లి, క్రిష్ణంపల్లి, కానగూడూరు గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులను, వాటి లీకేజీలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామక్రిష్ణయ్య, ఈవోపీఆర్‌డీ హరికృష్ణయాదవ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్ పాల్గొన్నారు.


కొర్రపంటను జాగ్రత్తగా కాపాడుకోవాలి

చాపాడు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రైతులు కొర్రపంటను జాగ్రత్తగా కాపాడుకోవాలని మండల వ్యవసాయాధికారిణి మ్యాగి అన్నారు. వెదురూరు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో మాట్లాడుతూ ప్రస్తుతం కొర్రపైరు కంకులు పాలుపోసే దశలో ఉన్నందున క్రిమికీటకాలు, తెగుళ్ల ఆశించకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కొర్రపైరును పరిశీలించి బాగుందన్నారు. సుమారు 3 వేల ఎకరాల్లో కొర్ర సాగు చేసినట్లు రైతులు ఆమెకు వివరించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ జెరూసా, రైతులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో భర్త మృతి, భార్యకు గాయాలు

జమ్మలమడుగు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని ధర్మాపురం బస్టాపు వద్ద బొలెరో క్యాంపర్ వాహనం స్కూటీని ఢీకొన్న ప్రమాదంలో రిటైర్డు టీచర్ నగళ్లపాటి సుబ్బరాయుడు (63) అక్కడికక్కడే మృతిచెందగా అతని భార్య క్రిష్ణవేణికి గాయాలయ్యాయి. మృతుడు మైలవరం మండలం వేపరాల గ్రామానికి చెందినవాడు. భార్యాభర్తలు మంగళవారం రాత్రి 7.30 గంటల సమయంలో వేపరాల నుంచి బయల్దేరారు ధర్మాపురం గ్రామం వద్ద స్కూటీని నిలిపి నీళ్ల తాగుతుండగా ప్రొద్దుటూరు మండలం మత్స్యకాలనీకి చెందిన ఎస్‌వీ క్రిష్ణారెడ్డి బొలెరో వాహనంలో ప్రొద్దుటూరుకు వెళుతూ అదే సమయంలో స్కూటీలో ప్రొద్దుటూరుకు వెళుతున్న వారిని ఢీకొన్నాడు. ఘటనా స్థలంలో భర్త సుబ్బరాయుడు మృతిచెందగా భార్య కుడి చేతికి రక్తగాయాలయ్యాయి. ఘటన జరిగిన వెంటనే జమ్మలమడుగు అర్బన్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. 108 వాహనంలో జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన మహిళను ప్రొద్దుటూరుకు తరలించారు.

మైదుకూరు ఆర్యవైశ్య సభ మాజీ అధ్యక్షుడు మృతి



తల్లం వెంకటసుబ్బయ్య

మైదుకూరు రూరల్ ,మార్చి11(ఆంధ్రజ్యోతి): మైదుకూరు ఆర్యవైశ్య సభ మాజీ అధ్యక్షుడు తల్లం వెంకటసుబ్బయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందినట్లు ఆయన కుమారుడు తల్లం సుధాకర్ తెలి పారు. తల్లం వెంకటసుబ్బయ్య ఆర్యవైశ్యసభ అధ్యక్షుడుగా ఉన్న సమయంలో అమ్మవారిశా లకు ఎనలేని సేవలు చేశారు. అంతే కాకుండా వాసవిమాతకు వెండి రథం కూడా అప్పుడే రూపకల్పన జరిగింది.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

బి.కోడూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఆర్‌ఈడీఎస్ ఎన్‌జీవో కోఆర్డినేటరు రవి, సీఎస్‌డబ్ల్యు సాయికిరణ్‌రాజు అన్నారు. మంగళవారం బి.కోడూరు హైస్కూలులో విద్యార్థులకు తల్లిదండ్రులకు బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలకు వివాహ వయసు 18 ఏళ్ల, పురుషులకు 21 ఏళ్ల అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

పేదలకు భూమి, ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

కొండాపురం మార్చి 11(ఆంధ్రజ్యోతి):పేదలకు రెండు ఎకరాల భూమి, మూడు సెంట్లు స్థలం వెంటే ఇవ్వాలని సీపీఐ ,ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలను గుర్తించి ఇళ్ల స్థలాలు, భూములు ఇవ్వాలని కోరారు.అనంతరం డిప్యూటీ తహసీల్దారు కు వినతి పత్రాన్ని అందజేశారు. సీపీఐ ఏఐటీయూసీ నాయకులు సుబ్బారెడ్డి,మనోహర్‌బాబు, వెంకటరమణ, సుబ్బారావు పాల్గొన్నారు.

పునరావాసం కల్పించి న్యాయం చేయండి

- ఆర్డీవోకు దుగ్గనపల్లె గ్రామ ప్రజల విజ్ఞప్తి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ

మైలవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): దాల్మియా పరిశ్రమ వలన దుమ్ము, ధూళితో పంటలు పండక రోగాల బారీన పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్న మాకు పునరావాసం కల్పించి న్యాయం చేయాలని జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీకి దుగ్గనపల్లె గ్రామస్థులు మొరపెట్టుకున్నారు. ఈనెల 27న దాల్మియా రెండవ ప్లాంట్‌కు జరిగే ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో భాగంగా ప్రజాభిప్రాయాలను తెలుసుకునేందుకు దుగ్గనపల్లె గ్రామంలో మంగళవారం ఆర్డీవో సాయిశ్రీ పర్యటించి గ్రామ ప్రజల సమస్యలు, వారి బాధలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో గ్రామస్థులు మాట్లాడుతూ దాల్మియా పరిశ్రమకు తాము వ్యతిరేకం కాదని, దుమ్ము, దూళితోపాటు బ్లాస్టింగ్ వలన ఇల్లు నెర్రలు చీలడం, సాగు చేసిన పంటలపై దుమ్ము, ధూళి పడి దెబ్బతింటున్నాయని ధూళి కాలుష్యం వలన పిల్లలు అనారోగ్యం భారీన పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆర్డీవోకు వివరించారు. గ్రామానికి పక్కనే దాల్మియా పరిశ్రమ ఉండడంతో చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోందని మా గ్రామాన్ని వేరే చోటికి తరలించి మాకు పునరావాసం కల్పించిన తర్వాత మా భూములు దాల్మియా యాజమాన్యం కొనుగోలు చేయాలని వారు ఆర్డీవో కు వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు లక్ష్మినారాయణ, డిప్యూటీ తహసీల్దారు, రెవెన్యూ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలం ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు



స్థలం వద్ద ప్రజలతో మాట్లాడుతున్న బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్

బ్రహ్మంగారిమఠం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ నిబంధనల ప్రకారం శ్మశానాన్ని ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్ హెచ్చరించారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారి మఠం మండల కేంద్రంలో సర్వేనెం.464లో శ్మశానానికి 10 ఎకరాలు కేటాయించినట్లు రికార్డుల్లో ఉంది. ఇటీవల ముగ్గురు వ్యక్తులు ఆరు ఎకరాలు శ్మశాన స్థలాన్ని ఆక్రమించడంపై కొత్తూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ప్రజా ఫిర్యాదుల సదస్సులో ఫిర్యాదు చేయడంతో ఈ విషయంపై బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్ మంగళవారం శ్మశాన వాటిక స్థలం వద్దకు వెళ్లి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల ప్రకారం శ్మశాన వాటికకు అప్పట్లో పది ఎకరాలు కేటాయించినట్లు రికార్డుల్లో ఉందని అయితే ప్రస్తుతం ముగ్గురు వ్యక్తులు ఆక్ర మించినట్లు తమకు ఫిర్యాదులు అందాయన్నారు. ఈ నేపథ్యంలోనే వారికి నోటీసులు జారీ చేసి సర్వే చేసి శ్మశాన స్థలం పది ఎకరాలను గుర్తిస్తామని తెలిపారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దారు జాన్సన్‌కు త్వరలోనే శ్మశాన స్థలంపై నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో వీఆర్వో సుధాకర్, సర్వేయరు ధర్మ, అధికారులు ఉన్నారు.

రైతు ఆత్మహత్యపై విచారణ

బ్రహ్మంగారిమఠం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండలంలోని సోదరివారిపల్లె గ్రామానికి చెందిన మాగిపోగు నవీన్‌కుమార్ అనే రైతు ఆత్మహత్య ఘటనపై బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ విచారించారు. 2024 సంవత్సరం మే 21న పురుగు మందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ విషయంపై అప్పట్లో కుటుంబ సభ్యులు తల్లి దేవరాజ్, భార్య అనితలు మా కుటుంబాన్ని ఆదుకోవాలని వినతిపత్రం ద్వారా అధికారులు, ప్రభుత్వానికి విన్నవించారు. ఈ విషయంపై మంగళవారం ఆర్డీవో చంద్రమోహన్, మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, ఏడీఏ మురళీధర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దారు జాన్సన్, బిమఠం వ్యవసాయాధికారి మల్లిఖార్జునలు వారి ఇంటి వద్దకు వెళ్లి విచారణ చేశారు. ఈ సందర్భంగా విచారణ నివేదికను జిల్లాకలెక్టర్‌కు సమర్పిస్తామని కుటుంబ సభ్యులకు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దేవరాజ్, మత్తయ్య, దానం, రామయ్య, ప్రభాకర్, శిఖామణి పాల్గొన్నారు.

సిరిధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్‌వల్లి

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సిరిధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని స్వతంత్ర్య ఆహార ఆరోగ్యశాస్త్రవేత్త పద్మశ్రీ డాక్టర్ ఖాదర్‌వల్లి పేర్కొన్నారు. మంగళవారం వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో సిరిధాన్యాలే సంపూర్ణ ఆరోగ్యం, ఈ ఒకే ఒక్క మార్పుతో నూరేళ్ల ఆరోగ్యం అన్న అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిపై 248 రకాలకుపైగా సిరిధాన్యాలు ఉన్నాయని, వాటిలో పీచుపదార్థం అధికంగా ఉన్నందున ఆరోగ్యంగా ఉండటానికి తోడ్పడుతాయన్నారు. అనంతరం డాక్టర్ ఖాదర్‌వలి, ఉష దంపతులను అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సిద్దేశ్వరరావు, కిశోర్ చంద్ర, లావణ్యకుమారి, ప్రసాద్, రజనీకాంత్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల వద్ద డబ్బులు వసూలు చేస్తే చర్యలు



క్షేత్రస్థాయిలో ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఎస్‌ఈ రమణ

ఖాజీపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రైతుల వద్ద మరమ్మతులకు డబ్బులు వసూలు చేస్తే సస్పెండ్ చేస్తామని జిల్లా విద్యుత్తు శాఖ ఎస్‌ఈ రమణ పేర్కొన్నారు. మంగళవారం ఖాజీపేట సబ్ స్టేషన్ ట్రాన్స్‌ఫార్మర్లను, క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని వినియోగదారులకు, రైతులకు నాణ్యమైన విద్యుత్తును అందించాలని సిబ్బందిని ఆదేశించారు. లైన్లకు అడ్డ ఉన్న చెట్లను, ఒరిగిన స్తంభాలను, మనిషికి అందే ఎత్తులో ఉన్న విద్యుత్తు వైర్లను గుర్తించి వాటిని పరిష్కరించాలన్నారు. ఎవరైనా విద్యుత్తు సిబ్బంది డబ్బులు అడిగితే 9440811751కు ఫిర్యాదు చేయాలని ఆయన రైతులను కోరారు. కార్యక్రమంలో మైదుకూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు భరణీకృష్ణ, అసిస్టెంట్ ఇంజనీరు నాగరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు రూరల్‌లో : విద్యుత్‌బకాయిలను రాబట్టడంలో జాప్యం మహించవద్దని జిల్లా విద్యుత్తు శాఖ ఎస్‌ఈ రమణ అన్నారు. స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద మంగళవారం విద్యుత్ అధికారుల సమావేశంలో విద్యుత్‌ను ఎలా ఆదా చేసుకోవాలని ,విద్యుత్ చౌర్యం జరుగకుండా ఎలా చూడాలని అనే విషయాలపై చర్చించారు.

ప్రభుత్వం జీవోను విడుదల చేయాలి

ప్రొద్దుటూరు రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఇస్తున్న ఉపకార వేతనానికి అదనంగా 50 శాతం టైఫండ్ వర్తింపజేస్తామన్న ప్రతిపాదనకు ఆమోదంపై సత్వరం ప్రభుత్వం జీవోను జారీ చేయాలని పశువైద్య కళాశాల విద్యార్థులు డిమాండ్ చేశారు. మంగళవారం 37వ రోజు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులు కళాశాల వద్దకు చేరుకుని ఇన్ని రోజులుగా విద్యార్థులు తమ న్యాయపరమైన డిమాండ్లపై నిరసన తెలుపుతున్నా అధికారులు ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నించారు. అయితే కళాశాల అసోసియేట్ డీన్ శ్రీనివాసప్రసాద్ సెలవులో ఉండడంతో తల్లిదండ్రులు వెనుతిరిగారు. తమ న్యాయబద్ధమైన డిమాండ్లను అమలు చేసేవరకు నిరసన దీక్ష కొనసాగిస్తామని విద్యార్థులు స్పష్టం చేశారు.

రైతు విశిష్ట సంఖ్యకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

ముద్దనూరు మార్చి11(ఆంధ్రజ్యోతి):ప్రతి రైతు విశిష్ట సంఖ్య రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏవో వెంకటకృష్ణారెడ్డి సూచించారు. మండల పరిధిలోని కొర్రపాడు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన రైతులకు వివరిస్తూ ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మద్దతు ధరకు కంది ,మినుము, శనగ ఉత్పత్తులను అమ్ముకోవడానికి రైతులు సీఎం యాప్ లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు.కందులు క్వింటా రూ.7550, మినుము క్వింటా రూ.7400, శనగ క్వింటా రూ.5650 ప్రభుత్వం మద్దతు ధర కల్పించిందన్నారు.పంట నమోదు చేసుకున్న రైతుల వివరాల జాబితాను రైతుల సమక్ష్యంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవాకేంద్రం సిబ్బంది రాధ పాల్గొన్నారు.

మయన్మార్ నుంచి ఏడుగురు శరణార్థుల రాక

గన్నవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మయన్మార్ నుంచి ఏడుగురు శరణార్థులు మంగళవారం రాత్రి గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. మయన్మార్‌లో ఫేక్ వీసాలతో ఉద్యోగాల కోసం వెళ్లిన వారిని తిరిగి పంపడంతో ఇండియన్ గవర్నమెంట్ సహాయంతో ఢిల్లీ చేరుకోగా అక్కడ నుంచి ఇండిగో విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. ఏడుగురిలో ప్రొద్దుటూరుకు చెందిన షంషేర్ భాషాను గన్నవరం సీఐ బీవీ శివప్రసాద్ రిసీవ్ చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. వారి తల్లిదండ్రులకు అప్పగిస్తున్నట్లు సీఐ తెలిపారు.